



టీచర్ల ఖాళీల తుది జాబితాపై కసరత్తు చేస్తున్న విద్యాశాఖ సిబ్బంది

ఉపాధ్యాయ ఖాళీలు ఏడు వేలు

- ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన బదిలీలకు రంగం సిద్ధం
- కొలిక్కి వచ్చిన హేతుబద్ధీకరణ ప్రక్రియ
- తుది గణాంకాలు లెక్కగడుతున్న విద్యాశాఖ

చిత్తూరు సెంట్రల్, మే 15 (ఆంధ్రజ్యోతి):బదుల పునర్వ్యవస్థీకరణ, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ప్రక్రియలు పూర్తయిన నేపథ్యంలో టీచర్ల బదిలీలు చేపట్టేందుకు విద్యాశాఖ సిద్ధమైంది.ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన నిర్వహించే బదిలీలకోసం చేపట్టిన ఖాళీల గుర్తింపు ప్రక్రియ కొలిక్కి వచ్చింది. తుది గణాంకాలను విద్యాశాఖ అధికారులు లెక్కలు కడుతున్నారు. ఏ ఒక్క పోస్టూ బ్లాక్ చేయకుండా, ఖాళీలు చూపేందుకు చర్యలు చేపట్టారు.మొత్తం 66 మండలాలకు సంబంధించి ఏడు వేల ఉపాధ్యాయ ఖాళీలు చూపనున్నారు. బదిలీ ప్రక్రియలో భాగంగా పాఠశాల, మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో క్యాడర్లవారీగా ఖాళీలను గుర్తించడంతో పాటు మరణించిన , వీఆర్ఎస్ తీసుకున్న, రిటైరైన ఉపాధ్యాయుల స్థానాలు, ఐదేళ్లు పూర్తి చేసుకున్న హెచ్ఎం, 8 ఏళ్లు పూర్తి చేసుకున్న టీచర్ల స్థానాలు, స్టడీ సెలవులపై వెళ్లిన ఉపాధ్యాయుల ఖాళీలు, పోస్కో కేసులు నమోదు కావడంతో వెళ్లిన వారి స్థానాలను క్లియర్ వేకెన్సీలుగా చూపనున్నారు. ఇప్పటికే 37 విభాగాల్లో టీచర్లు పనిచేస్తున్న చోట్ల ఉన్న 1918 వాటిని క్లియర్ వేకెన్సీలుగా చూపించారు. వీటితోపాటు మరో 5,082 ఖాళీలు చూపనున్నారు. ఒకే పాఠశాలలో ఐదేళ్లు పూర్తి చేసిన హెచ్ఎంలు, 8 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ కానున్న నేపథ్యంలో వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఖాళీల జాబితాను సిద్ధం చేశారు. 5/8 ఏళ్లపాటు ఒకేచోట పనిచేసిన టీచర్ల ఖాళీలు 3వేలుండగా, మిగులు (సర్‌ప్లస్) కింద 500, స్కూల్ కొత్త పోస్టులు (రీఅపోర్షన్), ఒక యాజమాన్య పాఠశాల నుంచి మరో యాజమాన్య పాఠశాలకు వెళ్లిన (షిఫ్టెడ్) ఖాళీలు 1,582 చూపుతున్నారు.

● ఖాళీలు వివరాలు

యాజమాన్యం	మంజూరైన పోస్టులు	పనిచేస్తున్న టీచర్లు	ఖాళీలు
ప్రభుత్వ	723	598	125
ఎంపీ/జడ్పీ	15,552	13,969	1583
మున్సిపల్ కార్పొరేషన్	589	454	135
మున్సిపాలిటీ	508	433	75
5/8 ఒకే చోట పనిచేసిన స్థానాలు	--	–	3000
మిగులు ఖాళీలు (సరప్లస్)	--	–	500
రీఅపోర్షన్/ షిఫ్టెడ్	--	–	1582
	17,372	15,454	7000

నేటినుంచి ఉద్యోగుల బదిలీలు

చిత్తూరు సెంట్రల్, మే 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ గురువారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాశాఖ మినహా జిల్లాలోని 98 ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు ఈ బదిలీలు వర్తించనున్నాయి.శుక్రవారం నుంచి జూన్ 2వ తేదీ వరకు బదిలీలకు అవకాశముంది.జిల్లాలో రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, అనుబంధ శాఖలు, ఫైర్, ఎక్సైజ్, రవాణా, అటవీ, జడ్పీ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఖజానా, ఆదాయ పన్ను.... ఇలా దాదాపు 98 శాఖల్లో సుమారు 12 వేల నుంచి 15 వేల వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. 2025 మే 1 నాటికి ఐదు సంవత్సరాల పాటు ఒకే చోట పనిచేసే ఉద్యోగులు తప్పని సరిగా బదిలీ కావాల్సి ఉంది. 2026 మే 31 లేదా అంతకు ముందు రిటైరయ్యే ఉద్యోగుల అభ్యర్థన మేరకు బదిలీ చేస్తారు.

వీరికి ప్రాధాన్యత

దృష్టిలోపం, మానసిక వికలాంగులైన పిల్లలుండడం, క్యాన్సర్, ఓపెన్ హార్ట్ ఆపరేషన్లు, న్యూరో సర్జరీ, కిడ్నీ మార్చుకున్నవారు, దీర్ఘకాలిక వ్యాధుల కారణంగా వైద్య కారణాలపై (స్వయంగా, జీవిత భాగస్వామి, వారిపై ఆధారపడిన పిల్లలు) బదిలీ కోరుకునే ఉద్యోగులు వైద్య సౌకర్యాలు అందుబాటు కోసం కోరుకునే స్టేషన్‌కు బదిలీ చేసుకునే అవకాశం కల్పిస్తారు.

వీరికి కలెక్టర్ ఆమోదం తప్పనిసరి

గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్లకు బదిలీలపై స్టాండింగ్ సూచనలు వర్తిసాయి. ఈ జాబితాను కలెక్టర్ ద్వారా ఆయా శాఖలకు పంపాల్సి ఉంటుంది.

‘రిజిస్ట్రేషన్’ లక్ష్యం రూ.980.55 కోట్లు

డీఐజీ గిరిబాబు



గిరిబాబు

చిత్తూరు కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో స్థిరాస్తి రంగం ద్వారా ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాబడి లక్ష్యంగా రూ.980.55 కోట్లుగా ప్రభుత్వం నిర్దేశించిందని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ గిరిబాబు వెల్లడించారు. గురువారం ఆయన ‘ఆంధ్రజ్యోతి’తో మాట్లాడారు. రాబడి లక్ష్యంలో.. చిత్తూరు జిల్లాకు సంబంధించిన ఎనిమిది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు రూ.218.17 కోట్లు, తిరుపతి జిల్లాలోని 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు రూ.762.38 కోట్లుగా నిర్ణయించినట్లు చెప్పారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా.. ఈ ఏడాది తిరుపతి జిల్లాలో.. అత్యధికంగా రేణిగుంటకు రూ.153.27 కోట్లు, తిరుపతి ఆర్వోకు రూ.150.11 కోట్లు, తిరుపతి రూరల్‌కు రూ.96.61 కోట్లు, అత్యల్పంగా చిన్నగొట్టిగల్లుకు రూ.6.73 కోట్లుగా నిర్ణయించామన్నారు. అలాగే చిత్తూరు జిల్లాలో.. అత్యధికంగా చిత్తూరు ఆర్వోకు రూ.77.79 కోట్లు, పలమనేరుకు రూ.34.91 కోట్లు, అత్యల్పంగా కార్వేటినగరానికి రూ.10.88 కోట్లుగా లక్ష్యాలను కేటాయించామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యంలో చిత్తూరు, తిరుపతి జిల్లాలో 81.35 శాతం మాత్రమే వృద్ధి సాధించిందని చెప్పారు. తిరుపతి జిల్లా రూ.686.98 కోట్ల లక్ష్యానికి రూ.521.74 కోట్లు (83.21శాతం) ప్రభుత్వ ఖజానాకు అందిందన్నారు. చిత్తూరు జిల్లా రూ.181.78 కోట్ల లక్ష్యంలో 77.49శాతం అంటే రూ.144.50 కోట్లు మాత్రమే వృద్ధి సాధించిందని వివరించారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సంస్కరణలు, ప్రవేశపెట్టిన స్లాట్ బుకింగ్ వంటి ప్రజా ఉపయోగ కార్యక్రమాలతో లక్ష్యాన్ని సాధిస్తామన్న ఆకాంక్ష వ్యక్తం చేశారు. కమర్షియల్ స్థలాన్ని రెసిడెన్షియల్ స్థలంగా రిజిస్ట్రేషన్ చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన తిరుపతి ఆర్వో కార్యాలయ జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ నీరజపై వేటు వేశామని, ఆమెపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే సబ్ రిజిస్ట్రార్లు ఎవరినీ వదలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్లు జరిగిన ప్రతి డాక్యుమెంటునూ పరిశీలిస్తుంటామని స్పష్టం చేశారు.

ఏపీఈసెట్ ఫలితాలు విడుదల

చిత్తూరు సెంట్రల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులు బీటెక్ కోర్సులో చేరేందుకు జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) నిర్వహించిన ఏపీఈసెట్ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి.ఈనెల 6వ తేదీన జరిగిన పరీక్షలను జిల్లాకు చెందిన 366మంది రాశారు. వీరిలో 335 మంది (91.53 శాతం) ఉత్తీర్ణత సాధించారు.వీరిలో 203 మంది బాలురు, 132 మంది బాలికలు వున్నారు.

మొరాయిస్తున్న ‘రేషన్‌కార్డుల’ సర్వర్

తీవ్ర ఇబ్బంది పడుతున్న జనం



గంగాధరనెల్లూరు సచివాలయంలో సర్వర్ పనిచేయకపోవడంతో వేచివున్న జనం

గంగాధరనెల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులకు సంబంధించిన సర్వర్ సరిగా పనిచేయడం లేదు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో జనం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రేషన్‌కార్డుల్లో మార్పు, చేర్పులతోపాటు కొత్త కార్డులకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే. దీనికోసం సచివాలయాలకు జనం తరలివస్తున్నారు. అయితే రేషన్‌కార్డులకు సంబంధించిన సర్వర్ మొరాయిస్తుండటంతో గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. సహనం కోల్పోయినవారు సంబంధిత డిజిటల్ అసిస్టెంట్లపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇకనైనా ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

ఆ రికార్డులు అప్పగించండి

● నేతిగుట్టపల్లె, ఆవులపల్లె బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లపై విజిలెన్సు విచారణకు అడుగులు

తిరుపతి(నేరవిభాగం), మే 15(ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని నేతిగుట్టవారి పల్లి, ఆవులపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల పనుల్లో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్సు విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. దీంతో వీటి రికార్డులను తక్షణం తమకు సమర్పించాలని కోరుతూ విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఇరిగేషన్ ఎస్ఈకి లేఖ రాశారు. ఈ రికార్డులు అందాక విచారణ అధికారులు.. ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆ రెండు రిజర్వాయర్లను పరిశీలించనున్నారు. ఎంత మేరకు పనులు జరిగాయి? ఎంత ఖర్చు పెట్టారనే కోణాల్లో విచారించనున్నారు.నేతిగుట్టపల్లె రిజర్వాయర్‌కు సంబంధించి రూ.717 కోట్లు, ఆవులపల్లెకు సంబంధించి రూ.660 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ రెండు పనులను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ కంపెనీ పీఎల్ఆర్ సంస్థ చేపట్టింది. నేతిగుట్టపల్లె బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో దాదాపు 89.9 శాతం పనులు పూర్తి కావడంతో విజిలెన్సు అధికారులు దీనిపైనే ఎక్కువగా దృష్టి కేంద్రీకరించనున్నారు. ఇప్పటి వరకు జరిగిన పనుల్లో 30 నుంచి 40 శాతం వరకు పనులు చేయకనే ఎం-బుక్కులు సిద్ధం చేసి నిధులు స్వాహా చేశారనే విమర్శలూ ఉన్నాయి. ఈ క్రమంలో జరిగిన పనుల విలువ ఎంత? ఎం-బుక్కుల్లో ఎంత చూపారనే దానిపైనా విచారించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు. ఈ విచారణను నెల రోజుల్లో పూర్తిచేసేందుకు విజిలెన్సు అధికారులు చర్యలు చేపట్టారు.

14 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం ప్రభావ కారణంగా జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 14 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా నదుంలో 40.2, అత్యల్పంగా చౌడేపల్లెలో ఒక మిమీ వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. రామకుప్పంలో 38.6, శాంతిపురంలో 24.6, సోమలలో 22.6, పలమనేరులో 22.4, గుడుపల్లెలో 21.2, కుప్పంలో 20.2, బైరెడ్డిపల్లెలో 15.8, పెద్దపంజాణిలో 15.4, పుంగనూరులో 11.4, బంగారుపాళ్యంలో 6.2, వి.కోటలో 5.4, గుడిపాలలో 2.8 మిమీ వర్షం కురిసింది.

20ఎకరాల భూకబ్జాయత్నం

చిత్తూరు రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలం, బండపల్లి రెవెన్యూ ఎగువమాసాపల్లి ప్రాంతంలోని ప్రభుత్వ, అటవీ భూములపై ఎగువ మాసపల్లి, గువ్వకల్లు గ్రామాలకు చెందిన కొంతమంది కన్ను వేశారు. వారికి అనుకూలంగా ఉన్న వ్యక్తులను ముందుపెట్టి ఆక్రమణకు పాల్పడ్డారు. గురువారం సాయంత్రం ఎగువ మాసాపల్లి ప్రాంతంలో 20 ఎకరాల భూమిని పొక్లయినర్‌తో చదును చేసే పనులు ప్రారంభించారు.అలాగే అటవీశాఖ భూములను కాజేయాలని చూశారు. ఈ విషయంపై గ్రామస్తులతో పాటు టీడీపీ నాయకులు కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. అటవీశాఖ అధికారులు వెంటనే ఆక్రమణ జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్నారు. అటవీశాఖ భూములుగా గుర్తించి అక్కడ చదును చేస్తున్న పొక్లయినర్‌ను సీజ్ చేశారు.పొక్లయినర్ డ్రైవరుతో పాటు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని సమాచారం.

కుప్పం వైసీపీకి గడ్డుకాలం!

● పార్టీకి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీనామా



రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న విద్యాసాగర్

కుప్పం, మే 15 (ఆంధ్రజ్యోతి): కుప్పం వైసీపీకి గడ్డుకాలం దాపురించింది. వరుసగా ఒక్కరొక్కరే పార్టీ పట్టునుంచి జారిపోతున్నారు.పార్టీలో బలమైన నేతగా ఉన్న జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పం వ్యవసాయ మార్కెట్టు కమిటీ మాజీ చైర్మన్ ఏఎస్.విద్యాసాగర్ రాజీనామా చేశారు. నిజానికి వైసీపీలో కొనసాగుతున్నవారిలో దాదాపు 50 శాతంమంది నాయకులు ఒకప్పుడు టీడీపీకి చెందినవారే. ఇప్పుడు రాజీనామా చేసిన విద్యాసాగర్, 2018లో అధికారంలో ఉన్నప్పుడే టీడీపీనుంచి బయటకు వచ్చి వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. 14వ వార్డు కౌన్సిలర్ మునస్వామి సహా అప్పట్లో పలువురు ఇదే నిర్ణయం తీసుకున్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్‌కు ఓట్లు సంపాదించిపెట్టడంలో కీలకపాత్ర పోషించారు. రామకుప్పం మండల ఇన్‌చార్జిగా విద్యాసాగర్ అక్కడ పార్టీని బలోపేతం చేయడంలో తనవంతు సహకారం అందించారు. అయితే మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2024 ఎన్నికలకు ముందే వీరి ప్రాధాన్యత పార్టీలో తగ్గుతూ వచ్చింది. తాజాగా జరిగిన మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో విప్‌ను ధిక్కరించి ప్రత్యేక సమావేశానికి గైర్హాజరైన 14వ వార్డు కౌన్సిలర్ మునస్వామి, ఆయన తల్లి అయిన 15వ వార్డు కౌన్సిలర్ తిలగవతిని ఎమ్మెల్సీ భరత్ సిఫార్సు మేరకు వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకర రెడ్డి పార్టీనుంచి సస్పెండు చేశారు. వీరితోపాటు మరో 8 మంది కౌన్సిలర్లపై కూడా ఇదే చర్య తీసుకున్నారు. ఈ 8 మంది మున్సిపల్ చైర్మన్ టీడీపీ అభ్యర్థి సెల్వరాజ్‌కు మద్దతు ప్రకటించి ఆయన విజయానికి కారకులయ్యారు. అయితే మునస్వామితోపాటు సస్పెండు అయిన 9 మంది కౌన్సిలర్లలో ఆరేడుగురు చాలాచాకాలంనుంచి పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. పార్టీలో తమను ప్రాధాన్యత ఇవ్వడంలేదని అసంతృప్తితో రగులుతున్నారు.తత్ఫలితంగానే మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గెలుపునకు దోహదం చేయడం. కనీస సంజాయిషీ, వివరణ కోరకుండా పార్టీనుంచి మునస్వామిని,ఆయన తల్లి తిలగవతిని సస్పెండు చేయడాన్ని విద్యాసాగర్ ప్రశ్నించారు. కుప్పంలోని తన స్వగృహంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ భరత్ ఒంటెత్తు పోకడలు పోతున్నారని, పార్టీకోసం కష్టపడిన తనలాంటి నాయకులను, కార్యకర్తలను పక్కనపెట్టి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.రామకుప్పం ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు, మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో ఓటమి పాలవడానికి తనలాంటివారిని సమన్వయం చేసుకోకపోవడమే కారణమని ఆక్షేపించారు. తగిన గుర్తింపులేని పార్టీలో ఉండలేక వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. భవిష్యత్తులో తనకు, తనతో ఉన్నవారికి ఏ పార్టీ గుర్తింపు ఇస్తుందో ఆ పార్టీలో చేరే అవకాశం ఉన్నదని విద్యాసాగర్ స్పష్టం చేశారు.అంతకుముందు వైసీపీ హయాంలో ఆ పార్టీ తరఫున గెలుచుకున్న మున్సిపల్ చైర్మన్ కుర్చీని కూడా డాక్టర్ సుధీర్ వదిలేసుకుని, మరీ టీడీపీలో చేరిపోయారు. చైర్మన్ పదవితోపాటు 16వ వార్డు కౌన్సిలర్ పదవిని కూడా ఆయన వదులుకున్నారు. ఇటీవల శాంతిపురం జడ్పీటీసీ శ్రీనివాసులుతోపాటు మాజీ సర్పంచి వసనాడు మురళి, ప్రస్తుత సర్పంచి జగదీశ్ భార్య నీలావతి తమ సస్పెన్షన్‌ను ప్రశ్నిస్తూ సమావేశం ఏర్పాటు చేశారు. మీడియాకు ఎక్కారు. ధిక్కార స్వరం వినిపించారు. ఈ సమావేశానికి హాజరయ్యారన్న నెపంతో మరికొందరిని పార్టీనుంచి సస్పెండు చేశారు. ఇలా సస్పెన్షన్‌కు గురైన మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్, మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సర్దార్‌బాషా ఎమ్మెల్సీ భరత్‌పై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసిన సెల్ఫీ వీడియో వైరల్‌గా మారింది. విద్యాసాగర్ రాజీనామా ప్రకటన చేస్తూ మరోమాట కూడా చెప్పారు. రాజీనామాల పర్వం ఇంతటితో ఆగదని, మరికొందరు ఎమ్మెల్సీ భరత్‌పై అసంతృప్తితో రగులుతున్నారని, వారు కూడా త్వరలోనే పార్టీని వీడనున్నారని సూచనప్రాయంగా తెలిపారు. దీంతో 2024 ఎన్నికల ముందు ‘వైనాట్ కుప్పం’ అని హుంకరించిన వైసీపీ అధిష్ఠానంలో ప్రస్తుతం ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న గుబులు మొదలైంది.



కాలినడక మార్గంలో పట్టుబడిన పాము

అలిపిరి నుంచి తిరుమలకు చేరుకునే కాలినడకమార్గంలోని ఏడోమైలు వద్ద గురువారం సుమారు ఏడు అడుగుల పొడవైన జెర్రిపోతు పాము పట్టుబడింది. ఆంజనేయస్వామి విగ్రహానికి సమీపంలోని జనరేటర్ గదిలోకి జెర్రిపోతు పాము ప్రవేశించడాన్ని సిబ్బంది గుర్తించి పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన చేరుకుని పామును చాకచక్యంగా పట్టుకున్నాడు. అనంతరం దట్టమైన అడవిలో విడిచిపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

విల్లుపురం-తిరుపతి ఎక్స్‌ప్రెస్ పాక్షిక రద్దు

మరమ్మతుల కారణంగా విల్లుపురం-తిరుపతి మధ్య నడుపుతున్న ఎక్స్‌ప్రెస్ రైళ్ల సేవలు పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. ఈ మేరకు తిరుచ్చి రైల్వే డివిజన్ కార్యాలయం గురువారం విడుదల చేసిన ప్రకటనలో... దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో గుంతకల్ డివిజన్ పరిధిలో పలు విభాగాల్లో మరమ్మతులు జరుగుతున్నాయని, అందువల్ల విల్లుపురం-తిరుపతి మధ్య నడుపుతున్న రైలు వేళల్లో మార్పు చేసినట్లు తెలిపింది. విల్లుపురం నుంచి ఉదయం 5.40 గంటలకు బయల్దేరే ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18,20,21,22,25,27,28,29, జూన్ 1,3 తేదీల్లో తిరుపతికి బదులు కాట్పాడి వరకు మాత్రమే నడుస్తుంది. అలాగే, మరుమార్గంలో తిరుపతి నుంచి మధ్యాహ్నం 1.40 గంటలకు విల్లుపురం వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతికి బదులు కాట్పాడి నుంచి బయల్దేరుతుందని అధికారులు తెలిపారు.

- ప్యారీస్, ఆంధ్రజ్యోతి

గరుడ వారధికి లోడ్ టెస్ట్

తిరుపతిలోని గరుడ వారధికి ఇటీవల జరిగిన మరమ్మతుల నేపథ్యంలో లోడ్ టెస్ట్ చేయనున్నారు. రామానుజ సర్కిల్ నుంచి శ్రీనివాసం వరకు.. శుక్రవారం నుంచి 21వ తేది వరకు 'స్పాన్ లోడ్ టెస్ట్' ఉంటుంది. ఆ సమయంలో రాకపోకలను నిలిపివేస్తున్నట్టు కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. కపిలతీర్థం నుంచి వచ్చే వాహనాలు శ్రీనివాసం కాంప్లెక్స్ వరకు వారధిపై రావచ్చని, అదేవిధంగా మార్కెట్ యార్డు టూ రేణిగుంటకు రాకపోకలు చేయవచ్చని పేర్కొన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


శ్రీహరి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ నారాయణగిరి షెడ్ల వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.27 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 74,020

తలనీలాలు సమర్పించినవారు: 29,361



పేద విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ విద్య

కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లోనూ చదవాలనే పేద పిల్లల ఆకాంక్షను నెరవేర్చాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 428 కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఇందుకోసం 25 శాతం సీట్లు కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈక్రమంలో 1వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వీరి ఫీజుల మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. అయినప్పటికీ మూడేళ్లుగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న వారి సంఖ్య తక్కువగానే ఉంటోంది. ప్రచారం,అవగాహనారాహిత్యమే ఇందుకు కారణమని ప్రభుత్వం గుర్తించింది. ఈక్రమంలోనే ఈసారి దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలని విద్యాశాఖాధికారులను ఆదేశించింది.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

గతంలో ప్రవేశాలు పొందిన వారు

సంవత్సరం	అడ్మిషన్ల సంఖ్య
1. 2022	57
2. 2023	1002
3. 2024	97



ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు

1వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఫీజులు చెల్లించనున్న ప్రభుత్వం

వీరు అర్హులు: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద కుంటుంబాల పిల్లలు అర్హులు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారయితే కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలలోపు పట్టణ ప్రాంతాలయితే రూ.1.44 లక్షలలోపు ఉండాలి. పాఠశాల నుంచి మూడు కిలోమీటర్ల లోపు దూరంలో ఉన్నవారే దరఖాస్తు చేసుకోవాలి. ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో చేరదలచుకున్న పిల్లలకు ఈ ఏడాది మార్చి 31 నాటికి ఐదేళ్ల వయసు నిండాలి. స్టేట్ సిలబస్ పాఠశాలల్లో చేరేవారికి మే 31 నాటికి ఐదేళ్లు నిండాలి.

అడ్మిషన్లకు ఎంపిక

దరఖాస్తులను ఈనెల 20 నుంచి 24 వరకు పరిశీలిస్తారు. 29న లాటరీ విధానంలో ఎంపిక చేసి మొదటి జాబితాను ప్రకటిస్తారు. వీరి ప్రవేశాలను జూన్ 8న నిర్ధారిస్తారు. జూన్ 11న లాటరీ ద్వారా రెండో దశ జాబితాను కూడా ప్రకటిస్తారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాల్లో ఉచితంగా చేరవచ్చు.

సీట్ల కేటాయింపు ఇలా ఉంటుంది

దివ్యాంగులు, హెచ్ఐవీ బాధితులు, అనాథలకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, సూచించిన పరిమితి లోపు ఆదాయం ఉన్న బలహీన వర్గాల పిల్లలకు 6 శాతం సీట్లను కేటాయిస్తారు. ఆయా రిజర్వేషన్లలో పిల్లలు లేకపోతే ఆ సీట్లను ఇతరులకు కేటాయిస్తారు. సందేహాలకు, సమాచారం కోసం టోల్‌ఫ్రీ నంబరు 1800 425 8599లో సంప్రదించవచ్చు.

దరఖాస్తు విధానం

దరఖాస్తుల ప్రక్రియ పారంభమైంది. అర్హులైన విద్యార్థులు ఈ నెల 19వ తేదీలోపు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ https://cse.ap.gov.in/ ద్వారా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు ప్రస్తుత చిరునామా ధ్రువీకరణకు ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్‌కార్డు, భూమి హక్కుల పత్రం, ఉపాధి హామీ జాబ్‌కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, విద్యుత్ బిల్లు, అద్దె ఒప్పంద పత్రాల్లో ఏదేని ఒకటి సమర్పించాల్సి ఉంటుంది. బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి.

తిరుపతి ఐఐటీకి మహర్దశ

ఏర్పేడు, మే 15(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2,313 కోట్లతో తిరుపతి ఐఐటీకి మహర్దశ రానుందని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణచెప్పారు. ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో గురువారం ఆయన ఇతర అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఐఐటీకి 2015లో ప్రభుత్వం 549 ఎకరాలు ఇచ్చిందన్నారు. మొదటి విడతగా కేంద్రం ఇచ్చిన రూ.1,444 కోట్లతో 1,200 మంది విద్యార్థులకు సౌకర్యాలు కల్పించామన్నారు. ఇప్పుడు రెండో విడత కింద అభివృద్ధి చేయడానికి కేంద్రం 2,313 కోట్లను మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ నిధులతో నాలుగేళ్ల కాల వ్యవధిలో 6,500మంది విద్యార్థులకు సౌకర్యంగా తరగతి గదులు, హాస్టల్ భవనాలు, ల్యాబ్ మొదలగు వసతులను ఏర్పాటు చేస్తామన్నారు. 12వేలమంది విద్యార్థులకు వసతులు కల్పించడానికి మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేసినట్లు వివరించారు. రెండో విడత కింద.. నాలుగేళ్ల వ్యవధిలో ఎంతెంత ఖర్చు చేయనున్నారు? ఏయే వసతులు కల్పించనున్నారనే వివరాలను ఆయన వెల్లడించారు. ఇలా ఫేజ్ 1, ఫేజ్ 2 కింద నిర్మాణాలను పూర్తిచేసి రానున్న రోజుల్లో 12వేలమంది విద్యార్థులకు సౌకర్యంగా ఐఐటీని తీర్చిదిద్ది అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లనున్నట్లు డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. కియా మోటార్, టాటా కంపెనీలు, అమరరాజా, నవయుగ కన్‌స్ట్రక్షన్స్‌తోపాటు మరిన్ని కంపెనీలతో కలిసి తిరుపతి ఐఐటీ పనిచేస్తోందన్నారు. నాలుగేళ్ల పాటు తిరుపతి ఐఐటీలో కియా మోటార్సు రూ.35కోట్లతో ఇంజనీరింగ్ ఎక్సలెన్సును పెంపొందించడం, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ఇంజనీరింగ్ రంగాల్లో భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుని ఒప్పందాన్ని కుదుర్చుకుని పనిచేస్తోందన్నారు. ఈ ఎంవోయూలో విద్యార్థుల కోసం ప్రీ ప్లేస్‌మెంట్, ఆఫర్లతో అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఎంటెక్ విద్యార్థులకు ప్రత్యేకంగా కియా ఇండియా స్కాలర్‌షిప్ రూపంలో ఆర్థిక సాయం అందిస్తామని ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ చెప్పారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

చిన్నారిపై హత్యాచారం కేసు మిస్టరీ వీడింది

● 17 నెలల తర్వాత పట్టుబడిన నిందితుడు

చంద్రగిరి, మే 15(ఆంధ్రజ్యోతి): దాదాపు ఏడాదిన్నర క్రితం జరిగిన మైనర్ బాలిక హత్యాచారం కేసు మిస్టరీ వీడింది. నిందితుడిని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం డీఎస్పీ ప్రసాద్ విలేకర్ల సమావేశంలో వెల్లడించిన వివరాలివి.. 2023 డిసెంబరులో చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లె జగనన్న కాలనీలో సిమెంటు ఇటుకల తయారీకి జార్ఖండ్ నుంచి కొంతమంది కార్మికులు వచ్చారు. ఈక్రమంలో గతేడాది జనవరి 3న ఈ కార్మికుల్లో ఒకరి కుమార్తె (6) ఇటుకల బట్టీ వద్ద ఆడుకుంటోంది. తర్వాత కనిపించలేదు. దీంతో తల్లిదండ్రులు పరిసరాల్లో గాలించారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమతో వచ్చిన బాల్ కిషోర్ ఖెర్వార్‌ను బాధిత బాలిక తల్లిదండ్రులు అనుమానించారు. అతడిని కొట్టి పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారించి బాల్‌కిషోర్‌ను విడిచిపెట్టారు. తర్వాత అతడు కుటుంబ సభ్యులతో కలిసి పరారయ్యాడు. తప్పిపోయిన బాలిక మృతదేహం నాలుగు రోజుల తర్వాత జగనన్న కాలనీ సమీపంలో అటవీ ప్రాంతంలో బయటపడింది. పోలీసుల నిర్లక్ష్యం వల్లే బాల్‌కిషోర్ చేతిలో బాలిక హత్యకు గురైందంటూ అప్పట్లో బాధితురాలి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేశారు. పోలీసులు తొలుత అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక హత్య కేసుగా నమోదు చేశారు. అప్పటి నుంచి నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో ఇటీవల కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. 17 నెలల తరువాత గురువారం తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలో బాల్ కిషోర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నారికి తినుబండారాలిచ్చి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాక హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. ఇతడ్ని కోర్టుకు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐలు రవీంద్రనాయక్, అనిత, సిబ్బంది మునిరత్నం, పురంధర్, గోపి, లోకనాథం తదితరులు పాల్గొన్నారు. కేసును చేదించిన ఎస్ఐలు రవీంద్రనాయక్, అనిత, సిబ్బంది మునిరత్నం, పురంధర్, గోపి, లోకనాథంలకు డిఎస్పీ ప్రసాద్, సీఐ సుబ్బరామిరెడ్డి చేతుల మీదుగా రివార్డులను అందజేశారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్


కలశం వద్ద పూజల్లో పాల్గొన్న ప్రముఖులు, భక్తులు

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు


ప్రత్యేకాలం కరణలో గురుదక్షిణా మూర్తి

శ్రీకాళహస్తి, మే 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మేథో గురుదక్షిణామూర్తికి గురువారం గురుపేచి సందర్భంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక క్రతువులు నిర్వహించారు. దక్షిణామూర్తికి అభిషేకం చేశాక, విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ కుమార్‌నాయుడు, చెంచయ్యనాయుడు, ప్రధానార్చకులు కరుణాకరన్ గురుకుల్, వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమూల ప్రక్షాళన దిశగా..!

● లింగ నిర్ధారణ కేంద్రాల పట్ల కలెక్టర్ సుమిత్‌కుమార్ కఠిన వైఖరి

చిత్తూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): తల్లి గర్భంలో నుంచి బిడ్డ బయటికి రాకముందే ఆడ, మగ అనేది తెలుసుకుని అబార్షన్లు చేసుకునేందుకు సహకరిస్తున్న ముఠా పట్ల కలెక్టర్ సుమిత్‌కుమార్ కఠినంగా వ్యవహరిస్తున్నారు.చిత్తూరు భరత్‌నగర్‌కాలనీలోని ఓ ఇంట్లో స్కానింగ్ కేంద్రాన్ని నిర్వహిస్తుండగా.. బుధవారం కలెక్టర్ స్వయంగా వెళ్లి నిర్వాహకుల్ని పట్టుకున్న విషయం తెలిసిందే.ఈ విషయాన్ని కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నారు. గురువారం నగరంలోని పొన్నియమ్మ గుడి వీధిలో ఉన్న రెండు మెడికల్ స్టోర్లను ఆయన తనిఖీ చేశారు. బుధవారం పట్టుబడిన నిర్వాహకుల్లో ఈ రెండు మెడికల్ స్టోర్లకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం.మొత్తం పదిమంది నిర్వాహకులు బయటి ప్రాంతాల్లో ఉంటూ గర్భిణుల్ని స్కానింగ్ కోసం పంపిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. వారందరిపై కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నారు.

● **వేలాది అబార్షన్లు..**

చిత్తూరు భరత్‌నగర్‌కాలనీలోని స్కానింగ్ కేంద్రంలో వారానికి మూడు రోజుల పాటు స్కానింగ్ చేస్తే సుమారు 50 మంది గర్భిణులు వచ్చేవారు. నెలకు 200 మంది, ఏడాదికి 2400 మంది చొప్పున 11 ఏళ్లగా నిర్వహిస్తుండడంతో సుమారు 26 వేల మంది లింగ నిర్ధారణ పరీక్షలు చేసుకున్నారని అంచనా వేస్తున్నారు. వీరిలో కనీసం సగం మందైనా అబార్షన్లు చేసుకుని ఉండొచ్చని అనుమానిస్తున్నారు.జిల్లాలో ఎక్కడెక్కడ అబార్షన్లు జరుగుతున్నాయో తెలుసుకుని అవి కూడా జరక్కుండా చూడడమే కలెక్టర్ తన తదుపరి లక్ష్యం చేసుకున్నారు.



లింగ నిష్పత్తి తగ్గితే ప్రమాదం

శ్రీకాకుళం, అనకాపల్లె వంటి వెనుకబడిన జిల్లాలతో పోల్చుకుంటే కొన్నేళ్లలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో బాలికల నిష్పత్తి తగ్గుతూ వస్తోంది. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మరింత ప్రమాదకర పరిస్థితులు ఏర్పడతాయి. తమిళనాడు తరహాలో లింగ నిర్ధారణ పరీక్షల పట్ల మనం కూడా కఠినంగా వ్యవహరిస్తేనే లింగ నిష్పత్తిని బ్యాలెన్సు చేయవచ్చు.

డీసీసీబీలో విచారణ పూర్తి

10 రోజుల్లో తుది నివేదిక సిద్ధం

చిత్తూరు కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో గత పాలకవర్గం చేసిన ఆర్థిక అవినీతి, అక్రమాలపై సహకార చట్టం సెక్షన్-51 కింద చేపట్టిన విచారణ ఎట్టకేలకు పూర్తయ్యింది. డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ప్రారంభమైన ఈ విచారణలో దాదాపు 80మంది వాంగ్మూలాలను ఇచ్చారు.గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో అప్పటి పాలకవర్గ ఛైర్‌పర్సన్ ఎం. రెడ్డెమ్మ పదవీకాలంలో కోట్లాది రూపాయిల అవినీతి అక్రమాలు చోటుచేసుకోవడంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ విచారణ అధికారిగా డీఆర్వో మోహన్‌కుమార్‌ను నియమించారు.ప్రస్తుతం విచారణ పూర్తయి నివేదిక తయారవుతోంది.10రోజుల్లో తుది నివేదిక సిద్ధం కానుంది.


డైరెక్టర్ హరినాథ రెడ్డిని విచారిస్తున్న డీఆర్వో మోహన్‌కుమార్ (ఫైల్ ఫొటో)

24.5 కిలోల గంజాయి స్వాధీనం

● ఇద్దరు పశ్చిమబెంగాల్ మహిళల అరెస్టు

రేణిగుంట, మే 15 (ఆంధ్రజ్యోతి): రేణిగుంటలోని ఓ లాడ్జీలో 24.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి తెలిపారు. రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ లాడ్జిలో గదిని పోలీసులు తనిఖీలు చేశారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన మామోని మండల్, నమిత మండల్ సూట్‌కేసులను చూడగా.. 24.5 కేజీల గంజాయి ఉంది. దీనిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశారు. ఒడిశాలో గంజాయి కొని కేరళకు తరలించే క్రమంలో ఇక్కడి గదిలో దిగారు. గంజాయి తరలింపులో కీలకంగా వ్యవహరిస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేయాల్సి ఉంది' అని ఏఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ అరుణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ నిర్వహణ భేష్

పరిశీలించిన 16వ ఆర్థిక కమిషన్ బృందం

తిరుపతి/రేణిగుంట, మే15(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తూకివాకంలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ బాగుందని 16వ ఆర్థిక కమిషన్‌సభ్యులు సౌమ్యకాంతి ఘోష్ అన్నారు. గురువారం ప్లాంట్ (చెత్త నుండి సంపద కేంద్రం)ను కలెక్టర్ వెంకటేశ్వర్, కార్పొరేషన్ కమిషనర్ మౌర్యతో కలిసి కమిషన్ సభ్యులు సౌమ్యకాంతి ఘోష్, కార్యదర్శి గౌతమ్ అల్లాడ పరిశీలించారు. ప్లాంట్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ, కంపోస్టు తయారీ, బయో మెథనైజేషన్ ప్లాంట్, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ తదితర యూనిట్ల గురించి కలెక్టర్, కమిషనర్ మౌర్య వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు తదితరాలను ప్రాసెసింగ్ చేసి సిమెంట్ ఫ్యాక్టరీలకు విక్రయిస్తారని, తడి చెత్తను కంపోస్టు ఎరువుగా మార్చి రైతులకు, ఉద్యానవనాలకు విక్రయిస్తారని, ఇక మార్కెట్ నుంచి వెలువడే, హోటల్స్ నుంచి సేకరించే వ్యర్థాల ద్వారా వంట గ్యాస్ ఉత్పత్తి చేసి విక్రయిస్తున్నట్లు వివరించారు. భవన నిర్మాణ వ్యర్థాలను ఆరు రకాలుగా గుల్ల, ఇసుకగా మారుస్తారని, దాంతో పేవర్స్ తయారు చేస్తారని తెలిపారు. ట్రీటెడ్ వేస్ట్ నీటిని పరిశ్రమలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు.


వేస్ట్ మేనేజ్‌మెంట్ వివరాలు తెలుసుకుంటున్న ఆర్థిక కమిషన్ సభ్యులు

రెండు మెడికల్ షాపుల్లో తనిఖీలు

ఒక షాపు సీజ్ ● మరో దుకాణానికి నోటీసులు


వినోద్ మెడికల్స్‌లో అసిస్టెంట్ డ్రగ్స్ కంట్రోల్ అధికారి హరిప్రసాద్ తనిఖీలు

చిత్తూరు రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): చిత్తూరు భరత్ నగర్ కాలనీలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ముఠా గుట్టు రట్టైన విషయం తెలిసిందే.ఈ ముఠాలో నిందితురాలైన సునీత భర్త పొన్నియమ్మ వీధిలో వినోద్ మెడికల్స్ పేరుతో దుకాణం నడుపుతున్నట్లు సమాచారం అందుకున్న అసిస్టెంట్ డ్రగ్స్ కంట్రోల్ అధికారి హరిప్రసాద్ షాపును తనిఖీ చేశారు. ఇందులో అబార్షన్ కిట్లను ,అబార్షన్ తర్వాత వాడే మందులను, నిషేధిత పెయిన్ కిల్లర్ మందులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. షాపును సీజ్ చేసి వినోద్‌పై కేసు నమోదు చేశారు. అదే వీధిలో ఉన్న సుధా మెడికల్ షాపును కూడా అధికారులు తనిఖీ చేశారు. సునీత గతంలో ఈ మెడికల్ షాలో పని చేసేదని తెలిసి సుధా మెడికల్స్ యజమానికి కూడా ముఠాతో సంబంధం ఉందని అనుమానించి తనిఖీ చేశారు. ఇందులో నిషేధిత మందులు కొన్నట్లు పాత బిల్లులు లభ్యమైనట్లు హరిప్రసాద్ తెలిపారు. సుధా మెడికల్స్ యజమాని సుబ్బారెడ్డికి నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 272 మంది గైర్హాజరు

చిత్తూరు సెంట్రల్, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 35 కేంద్రాల్లో గురువారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ సప్లిమెంటరీ పరీక్షలకు 272 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో శ్రీనివాసులు తెలిపారు. ఫస్టియర్ జనరల్‌లో 5,767 మందికి 5,572 మంది, ఒకేషనల్‌లో 286 మందికి 259 మంది హాజరయ్యారు. సెకండియర్ జనరల్‌లో 910 మందికి 869 మంది, ఒకేషనల్‌లో 112 మందికి 103 మంది హాజరయ్యారు. జిల్లా ప్రత్యేక అధికారి దయానందరాజు.. పీసీఆర్, జీవీ జూనియర్ కళాశాలలను, కమిటీ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, శరశ్చంద్రశేఖర్‌లు 10, ఫ్లయింగ్ స్క్వాడ్ 14 కేంద్రాలను పరిశీలించారు.

ఉష్ణోగ్రతలు తగ్గుముఖం

చిత్తూరు కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గురువారం పగటి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. రోజూ 39-40 డిగ్రీల మధ్య నమోదవుతున్న ఉష్ణోగ్రతలు 32-34 మధ్యకు పడిపోయాయి. మండలాలవారీగా.. రొంపిచెర్లలో 34.8, వెదురుకుప్పం, సదుం, పులిచెర్లలో 33.9, నింద్రలో 33.8, నగరిలో 33.7, విజయపురంలో 33.7, ఐరాల, కార్వేటినగరం, పూతలపట్టులో 33.6, సోమల, చౌడేపల్లిలో 33.5, పెద్దపంజాణి, గంగవరం, పుంగనూరు, పెనుమూరు, తవణంపల్లెలో 33.4, శ్రీరంగరాజపురంలో 33.3, పలమనేరు, గంగాధరనెల్లూరు, చిత్తూరు, బైరెడ్డిపల్లెలో 32.9, వి.కోటలో 32.8, రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె, కుప్పంలో 32.7, బంగారుపాళ్యంలో 32.3, యాదమరిలో 32.2, గుడిపాల, పాలసముద్రంలో 31.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పీఈఎస్‌లో న్యూరో సైన్స్ విభాగాధిపతిగా డాక్టర్ వినయ్‌కుమార్


డాక్టర్ వినయ్‌కుమార్ కాకు

కుప్పం, మే 15 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని పీఈఎస్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్, యోగ, న్యూరో సైన్స్ విభాగాధిపతిగా డాక్టర్ వినయ్‌కుమార్ కాకు నియమితులైనట్లు మెడికల్ సూపరింటెండెంటు డాక్టర్ ఎన్‌కే సుబ్రమణ్య తెలిపారు. బెంగళూరులోని ప్రఖ్యాత న్యూరో సైన్స్ ఇన్‌స్టిట్యూషన్ నిమ్ హన్స్‌లో విశిష్ట పూర్వవిద్యార్థి అయిన డాక్టర్ వినయ్‌కుమార్ కాకు, భారత ప్రభుత్వంనుంచి సిల్వర్ జూబ్లీ అవార్డు అందుకున్నట్లు చెప్పారు. మెదడు, వెన్నెముక, న్యూరో అంకాలజీ, పీడియాట్రిక్స్ న్యూరో సర్జరీ, ఎండోస్కోపీ న్యూరో సర్జరీ, స్టీరియో టాక్టిక్ రేడియో సర్జరీ, ఫంక్షనల్ న్యూరో సర్జరీ విభాగాల్లో నిపుణులని, 3 వేలకు పైగా శస్త్ర చికిత్సలు చేసి, ప్రపంచ ఫెడరేషన్ ఆఫ్ న్యూరో సర్జికల్ సొసైటీస్ (డబ్ల్యుఎఫ్ఎన్ఎస్) గుర్తింపు పొందారని వివరించారు.

అంగట్లోకి దూసుకుపోయిన కారు

● ఒకరి దుర్మరణం - ఇద్దరికి తీవ్రగాయాలు


రెడ్డెప్ప మృతదేహం

పలమనేరు, మే15(ఆంధ్రజ్యోతి): పలమనేరు-గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పలమనేరు పోలీసుల కథనం మేరకు... గుడియాత్తం నుంచి పలమనేరుకు వస్తున్న బొలేరో వాహనం దొమ్మెరపాపమ్మ గుడి వద్ద అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న అంగడిలోకి దూసుకు పోయింది. ఈ ప్రమాదంలో అంగడి వద్ద ఉన్న రెడ్డెప్ప(54) అక్కడికక్కడే మృతిచెందగా, అక్కడే ఉన్న కేశవులుకు రెండుకాళ్లు విరిగిపోగా, అమ్ములు అనే మహిళకు చేయి విరిగిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ వాహనం విడిచి పారిపోయాడు. ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే పలమనేరు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని గాయపడిన వారిని చికిత్స కోసం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు రెడ్డెప్ప మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

500 గ్రాముల గంజాయి స్వాధీనం

ఒకరి అరెస్టు, అదుపులో ఇద్దరు మైనర్లు

నగరి మే 15 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని వెంగన్నకండ్రిగ వద్ద ముందస్తు సమాచారంతో కాపుకాసి ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. వీరిలో విలాసపురం నివాసి ఎన్.ధనుష్(21), మరో ఇద్దరు మైనర్లుగా గుర్తించారు. వారి వద్ద నుంచి బైక్‌తోపాటు 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ధనుష్‌ను అరెస్టు చేయగా, అదుపులోకి తీసుకున్న బాలురకు కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు. వీరు నగరి పట్టణ పరిధిలోని పాతనేరస్తుడు మణికంఠ వద్దనుంచి గంజాయి కొనుగోలు చేసి తమిళనాడులోని పొదటూరుపేటలో విక్రయించడానికి వెళుతున్నట్లు గుర్తించామని గురువారం నగరి సీఐ విక్రమ్ తెలిపారు.

పట్టణ స్థానిక సంస్థలకు అదనపు నిధులివ్వండి

16వ ఆర్థిక సంఘానికి మేయర్ వినతి


సౌమ్యకాంతి ఘోష్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఉన్న పట్టణ స్థానిక సంస్థలకు అదనపు నిధులను కేటాయించాలని మేయర్ అముద 16వ ఆర్థిక సంఘాన్ని కోరారు. 16వ ఆర్థిక సంఘం సభ్యుడు సౌమ్యకాంతి ఘోష్ అధ్యక్షతన డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంపత్‌కుమార్, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులతో తిరుపతిలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆర్థిక సంఘం ద్వారా అందజేస్తున్న నిధులు, చేపడుతున్న నిధులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ వివిధ సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. అర్బన్ లోకల్ బాడీలకు అమృత్ స్కీమ్ రుణాలు, విద్యుత్ చార్జీలు పెనుభారంగా మారాయన్నారు. నీటిసరఫరా, వీధిలైట్లు, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ పనులు తదితర పనులకూ వ్యయం పెరిగిందన్నారు. ఇందుకు తగినట్లు నిధుల కేటాయింపును పెంచాలని కోరారు. విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించడానికి సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు నిధులను ఇవ్వాలని విన్నవించారు. ఆర్థిక సంఘం విడుదల చేసే నిధులను నిర్దేశించిన పనులకే వినియోగించేలా చూడాలన్నారు.

పలమనేరుకు నేడు మంత్రి నిమ్మల రాక

చిత్తూరు కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డుమార్గాన అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నుంచి బయల్దేరి సాయంత్రం 4.30 గంటలకు పలమనేరు నియోజకవర్గంలోని హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో 49.50 కి.మీ. వద్ద కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తారు. ఐదు గంటలకు కుప్పం నియోజకవర్గంలో పాలారు నదిపై నిర్మిస్తున్న డబుల్ లెవల్ రోడ్డు బ్రిడ్జి పనులను పరిశీలిస్తారు. 5.30 గంటలకు రోడ్డు మార్గంలో తమిళనాడులోని జోలార్‌పేట రైల్వే జంక్షన్ చేరుకుని విజయవాడకు బయల్దేరి వెళ్తారని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

బీజేపీ ఆధ్వర్యంలో నేడు తిరంగా ర్యాలీ

చిత్తూరు సెంట్రల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులపై పోరాడుతున్న సాయుధ దళాలకు సంఘీభావం తెలుపుతూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో చిత్తూరు నగరంలో తిరంగా ర్యాలీ చేపట్టనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌నాయుడు, శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు గాంధీ విగ్రహం నుంచి ఎంఎస్ఆర్ సర్కిల్, పొన్నియమ్మన్ గుడివీధి, గాంధీరోడ్డు, కోర్టు మీదుగా గాంధీ విగ్రహ కూడలి చేరుకుంటామని పేర్కొన్నారు. అన్నివర్గాలకు చెందిన ప్రజలు ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఉద్యాన రైతులకు సబ్సిడీపై పరికరాలు

చిత్తూరు సెంట్రల్, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు పలు రకాలైన పరికరాలను సబ్సిడీపై ఇవ్వనున్నట్లు ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 37రకాల పరికరాలను 35/40/50 శాతం సబ్సిడీతో అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యాన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకూడదు- ఎస్ఈ

చిత్తూరు రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): వేసవి కావడంతో ఏ ప్రాంతంలోనూ విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చూసుకోవాలని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. గురువారం స్థానిక గాంధీరోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. అధికలోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్యూర్ అయ్యే అవకాశాలు ఉన్నాయని, ఏఈలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పెండింగ్‌లోని వ్యవసాయ సర్వీసులను వెంటనే మంజూరు చేయాలన్నారు. పెండింగ్ వర్క్ ఆర్డర్లను ఈనెలాఖరులోపు క్లియర్ చేయకుంటే సంబంధిత అధికారుల జీతాల నుంచి జరిమానా కింద రికవరీ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి విద్యుత్ బిల్లులోనూ క్యూఆర్ కోడ్ ముద్రించడం జరిగిందన్నారు. దాన్ని స్కాన్ చేసి బిల్లును చెల్లించవచ్చన్నారు. దీనిపై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. ఈఈ మునిచంద్ర, డీఈ ఆనంద్, ప్రసాద్, ఏఈలు పాల్గొన్నారు.



ఈదురు గాలులతో నేలరాలిన మామిడికాయలు - కల్లూరులో లేచిపోయిన ఇంటిపైకప్పు రేకులు

గాలివాన బీభత్సం

● నేలరాలిన మామిడికాయలు


విరిగిన అరటి చెట్లు

కల్లూరు 15 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో టన్నుల కొద్దీ మామిడికాయలు నేలరాలాయి. పలు చెట్లు విరిగిపోయాయి. ఎక్కడికక్కడ విద్యుత్ సరఫరా ఆగిపోయింది. మండలంలోని కావేటిగారిపల్లి పంచాయతీ చెన్నుపాటివారిపల్లిలో పిడుగుపాటుకు పాడి ఆవు మృతి చెందింది. కల్లూరు దిగువవీధిలోని ఓ ఇంటి పైకప్పు రేకులు గాలికి లేచిపోయాయి. కల్లూరు, పులిచెర్ల, రెడ్డివారిపల్లి, కమ్మపల్లి, ఎల్లంకివారిపల్లి, కావేటిగారిపల్లి తదితర పంచాయతీల్లో మామిడి పంటకు అపారనష్టం వాటిల్లింది. ఈదులు గాలులతో మామిడికాయలు రాలిపోవడంతో ఎంత మేరకు నష్టం జరిగిందనేది శుక్రవారం ఉదయం తెలుస్తుందని రైతులు తెలిపారు. సుమారు 50 టన్నుల మామిడికాయలు నేలరాలినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. గత కొద్ది రోజులుగా సూర్య ప్రతాపానికి అల్లాడిన ప్రజలు గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో సేదతీరారు.

కనులపండువగా ప్రసన్న ముత్తుమారెమ్మ ఊరేగింపు



కుప్పం, మే 15 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా రెండవ రోజైన గురువారం రాత్రి ప్రసన్న ముత్తుమారెమ్మ ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. ఉదయం గంగమ్మ అమ్మవారితోపాటు ముత్తుమారెమ్మకు సైతం ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. పుష్పాలంకరణలు చేశారు. ఉదయం నుంచి రాత్రి దాకా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం రాత్రి ముత్తుమారెమ్మ ఉత్సవ విగ్రహాన్ని పల్లకీపై అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి, నైవేద్యాలు సమర్పించి అమ్మవారి దీవెనలు పొందారు.

గంగమ్మ భూదానానికి రూ.22 లక్షల విరాళం

ప్రసన్న తిరుపతి గంగమాంబకోసం కొనుగోలు చేయనున్న స్థలానికి భూదానం కింద ఇప్పటిదాకా దాతలనుంచి రూ.22 లక్షలు వచ్చినట్లు గంగజాతర ఉత్సవ కమిటీ ప్రథమ సభ్యుడు బీఎంకే రవిచంద్రబాబు, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్ సురేశ్ బాబు, ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్ తెలిపారు. ఆలయ ఆవరణలో గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ బుధవారంనుంచి ప్రారంభమైన గంగజాతర మహోత్సవాలు ఈనెల 21వ తేదీదాకా వైభవంగా సాగుతాయన్నారు. ఈనెల 19వ తేదీన అగ్నిగుండం, 20న అమ్మవారి శిరస్సు ఊరేగింపు, 21న అమ్మవారి విశ్వరూప దర్శనం ఘనంగా నిర్వహిస్తామన్నారు. అమ్మవారి విశ్వరూప దర్శనానికి ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు హాజరై, గంగమ్మను దర్శించుకుని ప్రభుత్వం తరఫున సారె సమర్పించే అవకాశం ఉన్నదని చెప్పారు. కేవలం ఏడు నెలల వ్యవధిలో అమ్మవారి హుండీ ద్వారా ఏకంగా రూ.21 లక్షల ఆదాయం లభించిందన్నారు. గత అయిదేళ్ల వైసీపీ పాలనలో అమ్మవారికి వచ్చిన విరాళాల వివరాలను నాటి బాధ్యులు ఇప్పటివరకు సమర్పించలేదని విమర్శించారు. ఈ సమావేశంలో గంగ జాతర ఉత్సవ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా గంగమ్మ శిరస్సు ఊరేగింపు



ఊరేగించిన గంగమ్మ శిరస్సు - గంగమ్మ సేవలో ఎమ్మెల్యే దంపతులు

పలమనేరు, మే 15 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా వేలాది మంది భక్తుల మధ్య గంగమ్మ శిరస్సు ఊరేగింపు జరిగింది. బుధవారం అర్ధరాత్రి పాతపేట వేణుగోపాలస్వామి ఆలయం వద్ద నుంచి తాలూక కచ్చేరివీధి, జాతీయ రహదారి, వి.వి.మహల్‌రోడ్డు, జౌళివీధి, బజారువీధి, గంగమ్మ గుడివీధులగుండా శిరస్సును ఊరేగించారు. గురువారం తెల్లవారుఝామున గంగమ్మ గుడి వద్ద భక్తుల దర్శనార్థం గంగమ్మ శిరస్సును విశ్వరూపదర్శనంగా నిలిపారు. వేలాది మంది భక్తులమధ్య పెద్ద సంఖ్యలో పోలీసుల బందోబస్తుతో బాణసంచా పేలుళ్ల మధ్య గంగమ్మ శిరస్సు ఊరేగించారు. ఊరేగింపు ప్రారంభమైన కొద్దిసేపటికే వర్షం ప్రారంభమైనప్పటికీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వందలాది జంతువులను మొక్కుబడిగా భక్తులు బలులు ఇవ్వడంతో వీధులన్నీ రక్తసిక్తమయ్యాయి. మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు బ్లీచింగ్ వేస్తూ ఎటువంటి అంటువ్యాధులు వ్యాప్తిచెందకుండా చర్యలు తీసుకొన్నారు. జాతర సందర్భంగా గురువారం ఉదయం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, రేణుకారెడ్డి దంపతులు గంగమ్మ విశ్వరూపాన్ని దర్శించుకొన్నారు. ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలాజి కోఆపరేటివ్ సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్.వి. బాలాజి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ వైసీపీ నాయకులతో కలిసి వచ్చి అమ్మవారిని దర్శించుకొని వెళ్లారు.

పకడ్బందీగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు


సిబ్బందికి సూచనలిస్తున్న వెంకటేశ్వరరావు

చిత్తూరు సెంట్రల్, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఏడీ2, పరీక్షల సహాయ కమిషనర్ వెంకటేశ్వరరావు అన్నారు. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, కస్టోడియన్లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లోని రెవెన్యూ, పోలీసు ఇతర సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎక్కడ పొరపాటు జరిగినా తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పరీక్ష కేంద్రాల్లో అసౌకర్యాలు లేకుండా చీఫ్ సూపరింటెండెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఏ ఒక్కరూ సెల్‌ఫోన్ తీసుకురాకూడదని స్పష్టం చేశారు. ఏడీ1 సుకుమార్, చిత్తూరు డీవైఈవో ఇందిర, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫెయిలైన వారందరికీ హాల్ టికెట్లు

విద్యార్థులు నష్టపోకుండా ఉండటానికి ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా ఫెయిలైన వారందరికీ హాల్ టికెట్లను అందుబాటులో ఉంచిందని డీఈవో కార్యాలయ అధికారులు తెలిపారు. జిల్లాలో 20,769 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 6850 మంది ఫెయిలయ్యారు. గడువులోపు పరీక్ష ఫీజు చెల్లించినవారికి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ అవుతాయి. మిగిలినవారు ఏ సబ్జెక్టుల్లో పరీక్ష రాయాలని భావిస్తున్నారో.. ఆ పరీక్షకు ఒక్క రోజు ముందు రూ.500 అపరాధ రుసుం చెల్లించి.. హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష రాసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. కాగా, ఓపెన్ స్కూల్‌కు సంబంధించి టెన్త్‌లో 670 మంది, ఇంటర్మీడియట్‌లో 2,182 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకు అనుగుణంగా జిల్లా విద్యాశాఖ అధికారులు 36 పరీక్ష కేంద్రాలను గుర్తించారు.

పర్యాటక ప్రాంతాల్లో

వసతుల కల్పనపై దృష్టి పెట్టండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జిల్లా పర్యాటక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాణిపాకం, మొగిలి, బోయకొండ, కుప్పం ప్రాంతాల్లో వసతుల కల్పనపై నెలలోగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధిలో భాగంగా పెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చేవారితో చర్చించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. కాణిపాకం, బోయకొండ దేవస్థానాల్లో 'ప్రసాదం' పథకం కింద అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించినట్లు వివరించారు. కుప్పంలో ననియాల ఎకో టూరిజం, కంగుంది, పాలారు ప్రాంతాల్లో అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన భూకేటాయింపులపై రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకోవాలని పర్యాటక శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. అలాగే ఎకో టూరిజం అభివృద్ధికి అటవీశాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అటవీశాఖ డీఎఫ్‌వో భరణి, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, పర్యాటకశాఖ అధికారి గౌరి, జిల్లా దేవదాయ శాఖ అధికారి చిట్టెమ్మ, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


వర్షానికి రాలిపోయిన మామిడి


విరిగిపోయిన అరటిచెట్లు

వర్షంతో పంట నష్టం


వాలిపోయిన రాగిపంట

పలమనేరు, మే 15: పలమనేరు మండలంలో బుధవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లోని మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. కొన్నిచోట్ల అరటితోటలు నేలకొరిగాయి. రాగిపంటలు సైతం పడిపోయాయి. మరో 10 రోజుల్లో కోతకు వస్తుందనగా రాగి పంట నేలకొరిగి పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈదురు గాలులతో వర్షం కురియడంతో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని రైతులు తెలిపారు. ఇప్పటికే గత 15రోజులులుగా రెండు పర్యాయాలు గాలివానల కారణంగా మామిడి తోటలకు తీవ్రంగా నష్టం జరిగిందని, ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


కాలిపోతున్న టెంకాయచెట్టు

టెంకాయ చెట్టుపై పడిన పిడుగు

పలమనేరు మండలం మొరం పంచాయతీ నడిమిదొడ్డిపల్లిలో నివాసాల మధ్య ఉన్న టెంకాయ చెట్టుపై బుధవారం అర్ధరాత్రి పిడుగు పడింది. భీకర శబ్దంతో పిడుగు పడటంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. టెంకాయచెట్టు పూర్తిగా కాలిపోయింది.

రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం




పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్, డీఎఫ్‌వో భరణి తదితరులు - చిత్తూరు-ఒంగోలు బాలికల జట్లు

యాదమరి, మే 15 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండల పరిధిలోని మోర్దానపల్లె వద్ద ఉన్న పీఈఎస్ పబ్లిక్ పాఠశాల వేదికగా బాలబాలికలకు 10వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ పోటీలు గురువారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్, డీఎఫ్‌వో భరణి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెంగ్రాయనాయుడు తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈనెల 18వ తేదీ వరకు జరుగుతాయని పోటీలు నిర్వాహకులు తెలిపారు. ఈస్ట్ గోదావరి, వెస్ట్ గోదావరి, కృష్ణా, గుంటూరు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ఒంగోలు తదితర ఉమ్మడి జిల్లాల జట్లు తరలివచ్చాయి. ముఖ్య అతిథులుగా ఏపీ టెక్నికల్ కమిటీ చైర్మన్ సురేష్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎన్‌పీ జయప్రకాష్, డీఎస్‌డీవో బాలాజి, పీఈఎస్ పబ్లిక్ పాఠశాల డైరెక్టర్ కుమారస్వామి నాయుడు, ప్రిన్సిపాల్ వై.వి.కృష్ణబాబు పాల్గొన్నారు.

తొలిరోజున ఇలా..: బాలికల విభాగంలో.. చిత్తూరు, కృష్ణా జట్ల క్రీడాకారులు, బాలుర విభాగంలో.. అనంతపురం, చిత్తూరు జట్ల క్రీడాకారులు ముందంజలో ఉన్నారు.

వైభవంగా అర్జున తపస్సు



తపస్మాను ఎక్కుతున్న అర్జున పాత్రధారి

గుడుపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యామగానిపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల మహాభారత బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అర్జున తపస్సు ఘట్టం వైభవంగా జరిగింది. ఉదయం ధర్మరాజుల మూల విరాట్‌కు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అర్జున పాత్రధారి తపస్సుమానును ఎక్కే సందర్భంలో ఒక్కో మెట్టుకు ఒక్కో పద్యం పాడుతూ తనతో పాటు జోలెలో తీసుకెళ్లిన ఫలపుష్పాలను, విభూది, నిమ్మకాయలను అన్ని వైపులా వెదజల్లాడు. వీటిని దక్కించుకోవడానికి మహిళలు పోటీపడ్డారు. ఆ తరువాత వారు తపస్మాను ఎదుట వరపడ్డారు. ఈ ఘట్టాన్ని తిలకించడానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

జాతరలో అన్నదాన కార్యక్రమాలు



అన్నదానం చేస్తున్న బాలాజి, ఎమ్మెల్యే సతీమణి రేణుకారెడ్డి

పలమనేరు, మే 15 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో గురువారం తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా ప్రతి ఏటా బాలాజి కో ఆపరేటివ్ సూపర్‌బజార్ వద్ద సూపర్‌బజార్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. గురువారం అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సతీమణి రేణుకారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్.వి.బాలాజి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. గాండ్ల సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ గుడిలో ప్రసాదాలు భక్తులకు పంచిపెట్టారు. పలమనేరు పరిరక్షణ సమితి అధ్వర్యంలో జాతీయ రహదారిపై ఎన్జీవో హోం సమీపంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో పలమనేరుపరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు. పలమనేరు యోగి వేమారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు బిర్యాని పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

కుప్పంలో 10 రైళ్ల నిలుపుదలకు రైల్వే అంగీకారం

కుప్పం, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని కుప్పంలో ఇప్పుడు నిలుపుతున్న రైళ్లను కాక మరో పది ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు రైల్వే శాఖ ఉన్నతాధికారులు అంగీకరించారు. గురువారం నుంచి ప్రారంభమైన ఈ రైళ్ల నిలుపుదల జాతర ముగింపు రోజైన ఈనెల 21వ తేదీదాకా కొనసాగుతుంది. జాతర సందర్భంగా రైళ్లను నిలుపుదల చేయాలంటూ కుప్పం పట్టణానికి చెందిన సాయిమాతా సేవాట్రస్టు అధ్యక్షుడు ఇటీవల రైల్వే ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అదనంగా 10 రైళ్ల స్టాపింగ్‌కు అనుమతిస్తూ రైల్వే శాఖ గురువారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయానికి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు, దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజరు ముకుల్ శరణ్ మాతూర్‌కు, దక్షిణ పశ్చిమ రైల్వే బెంగళూరు డివిజనల్ మేనేజరు అశుతోశ్ కుమార్ సింగ్‌కు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నంలకు జగదీశ్‌బాబు అమ్మవారి భక్తుల తరపున ధన్యవాదాలు తెలిపారు.

టీడీపీ సోమల అధ్యక్షుడిగా శివశంకర్



టీడీపీ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యం నాయుడు

సోమల, మే 15 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ టీడీపీ అధ్యక్షుడిగా పీవీ.శివశంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. గురువారం సోమలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో చురుగ్గా పనిచేసిన కార్యకర్తలను గుర్తించి అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేందుకు చర్యలు తీసుకునేందుకు గ్రామ కమిటీలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో కమిటీ అధ్యక్షుడిగా శివశంకర్, ప్రధాన కార్యదర్శిగా ఎన్ఎస్.రెడ్డిపార్థసారథి, ఉపాధ్యక్షుడిగా జి.మురళీని కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు వరదం జనార్థన్, ఎస్.సదాశివయ్య, వైవీ సుబ్బయ్యశెట్టి, మల్లికార్జున, చాణుక్య, మహేంద్రబాబు, మేకల గంగాధరం, సీ జనార్థన్, సుబ్రహ్మణ్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఊరేగింపునకు అనుమతి ఇవ్వండి



రైల్వే అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న జగదీశ్‌బాబు

కుప్పం, మే 15 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని రైల్వే గేటు మీదుగా కొత్తపేటకు అమ్మవారి శిరస్సు ఊరేగింపు వెళ్లడానికి అనుమతినివ్వాలని సౌత్ వెస్ట్రన్ రైల్వే బెంగళూరు డివిజన్ బంగారుపేట సెక్షన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు మహబూబ్‌బాషాను సాయిమాతా సేవాట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు రాష్ట్ర ప్రభుత్వం తరపున విన్నవించారు. బంగారుపేటలో గురువారం ఆయన అధికారిని కలిశారు. ఈ సందర్భంగా జగదీశ్‌బాబు మాట్లాడుతూ దక్షిణ భారతదేశ కూడలి అయిన కుప్పంలో నెలకొన్న గంగమ్మ అమ్మవారిని జతర సందర్భంగా దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని చెప్పారు. దీనివల్ల ప్రధాన పట్టణానికి, కొత్తపేటకు మధ్య రైల్వే లైన్‌మీదుగా ఉన్న గోడను తాత్కాలికంగా తొలగించి అమ్మవారి శిరస్సు ఊరేగింపునకు ఈనెల 21వ తేదీన అనుమతినివ్వాలని కోరారు. ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని జగదీశ్‌బాబుకు మహబూబ్‌బాషా చెప్పారు. ఈ కార్యక్రమంలో కర్పూరం బాబు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి సల్లాపురెమ్మ ఆలయ కుంభాభిషేకం



సల్లాపురెమ్మ ఆలయం

బైరెడ్డిపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె పట్టణంలోని సల్లాపురెమ్మ ఆలయ కుంభాభిషేక ఉత్సవాలు ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీన గంగ పూజ, గణపతిపూజ, శివపుణ్యాహం, రక్షాబంధనం, అంకురార్పణం, వాస్తుపూజ, క్షీరాభిషేకం, 18న ప్రధాన కలశ స్థాపన, నవగ్రహపూజ, అగ్నిప్రతిష్ఠ, మహాగణపతి, నవగ్రహ, మృత్యుంజయ, దుర్గా హోమాలు, 19న మహాకుంభాభిషేకం జరుగుతుందన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

ఘనంగా కల్యాణ వెంకన్న మొక్కుబడి ఉత్సవం



బైరెడ్డిపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నపల్లె కల్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి మొక్కుబడి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అర్చకులు విశేషాలంకరణ గావించి ప్రత్యేకపూజలు జరిపారు. అనంతరం ఉత్సవ మూర్తులను మేళతాళాలమధ్య ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త నారాయణ మొదలి, కమిటీసభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పంచాయతీ కార్యదర్శి పట్ల దురుసు ప్రవర్తన

● నలుగురు యువకులపై కేసు నమోదు

రామకుప్పం, మే 15 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని చెరువులో వృక్షాల నరికివేతను అడ్డుకున్న పంచాయతీ కార్యదర్శి పట్ల దురుసుగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించిన నలుగురు యువకులపై రామకుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు... మండల పరిధిలోని రాజుపేటకు చెందిన షణ్ముగం, సురేష్, మహేష్, ప్రశాంత్‌లు ఈనెల 12న గ్రామ సమీపంలోని పెద్దచెరువులో నీలగిరి వృక్షాలను నరికి, లగేజీ ఆటోలో తరలించేందుకు సిద్ధపడ్డారు. ఈ విషయాన్ని పంచాయతీ వార్డు సభ్యుడు నారాయణస్వామి పంచాయతీ కార్యదర్శి యశ్వంత్‌కు తెలిపారు. యశ్వంత్ అక్కడకు చేరుకుని, వృక్షాల నరికివేతను అడ్డుకున్నారు. అనంతరం నారాయణస్వామితో కలిసి యశ్వంత్ రామకుప్పం తహసీల్దారు కార్యాలయానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలో హంద్రీ-నీవా కాలువ సమీపంలో నిందితులు వారిని అటకాయించి దుర్భాషలాడారు. షణ్ముగం.. యశ్వంత్ మెడ పట్టుకునిపక్కకు నెట్టేసి అక్కడి నుంచి పారిపోయాడు. జరిగిన సంఘటనపై యశ్వంత్ గురువారం రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులకు భయపడి తాను ఈ విషయాలను ఎవరికీ చెప్పలేదని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామస్థులు తనకు అండగా ఉంటామని చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. యశ్వంత్ ఫిర్యాదు మేరకు నల్గురు నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంగన్వాడీల్లో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోండి

రామకుప్పం, మే 15 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లోని ఖాళీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవోలు అమరజ్యోతి, కల్పన తెలిపారు. రామకుప్పం మండలం పంద్యాలమడుగు అంగన్వాడీ కేంద్రంలో ఆయా పోస్టు, రామకుప్పం మండలం పామనబోయనపల్లె, శాంతిపురం మండలం తిమ్మరాజుపల్లెల్లో మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టులు ఖాళీగా ఉన్నాయని వారు తెలిపారు. రోస్టరు పాయింటు ప్రకారం పంద్యాలమడుగు ఆయా పోస్టు ఎస్సీ, పామనబోయనపల్లె మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టు ఓసీ, తిమ్మరాజుపల్లె మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టు బీసీ-ఏ కేటగిరిలకు రిజర్వు చేయబడ్డాయన్నారు. ఆయా గ్రామాల పరిధిలోని అర్హులైన అభ్యర్థులు శాంతిపురం సీడీపీవో కార్యాలయంలో దరఖాస్తు ఫారాలను తీసుకుని, వాటిని పూరించి, అవసరమైన అన్ని ధ్రువపత్రాలను జతచేసి ఈనెల 24వ తేదీ సాయంత్రం లోపు చేర్చాలని వారు కోరారు. పూర్తి వివరాలకు సీడీపీవో కార్యాలయాన్ని సంప్రదించాలని వారు సూచించారు.

పుంగనూరుకు రానున్న జకియాఖానం

పుంగనూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టంపై మైనార్టీలకు అవగాహన కల్పించడానికి శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్, బీజేపీ నాయకురాలు జకియాఖానం త్వరలో పుంగనూరులో సదస్సు నిర్వహించనున్నట్లు పార్టీ నాయకుడు అయూబ్‌ఖాన్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వక్ఫ్‌సవరణ చట్టాన్ని కాంగ్రెస్‌పార్టీ తప్పుపడుతోందన్నారు. గత 70ఏళ్లలో ముస్లింల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఏమి చేసిందని నిలదీశారు. బీజేపీ నాయకులు ఎస్సీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, నాగరాజ, శంకర్, అమరనారాయణ, మధు తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

కుప్పం, మే 15 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల అటవీ ప్రాంతంలోని సారా స్థావరాలపై గురువారం కుప్పం ఎక్సైజ్ పోలీసులు, పలమనేరు బీఎంపీపీ సిబ్బందితో కలిసి అకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మోట్లచేను గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గల సారా బట్టీ వద్ద 100 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. 10 లీటర్ల సారా క్యాన్ కలిగిన మోటారు సైకిల్‌ను సారాతో సహా సీజ్ చేశారు. ఈ కేసులో మోట్లచేను గ్రామానికి చెందిన బి.శ్యామరాజు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు మోహన్‌బాబు, అన్వేష్, హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమాచారి, కానిస్టేబుల్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి



కల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీ చెన్నుపాటివారిపల్లిలో గురువారం సాయంత్రం పిడుగుపాటుకు పాడి ఆవు మృతి చెందిన సంఘటన గ్రామంలో కలకలం రేపింది. గ్రామానికి చెందిన రాజేంద్ర నాయుడు తన ఇంటి సమీపంలోని వ్యవసాయ పొలం వద్ద ఉన్న కొబ్బరిచెట్టు కింద పాడి ఆవును కట్టేశాడు. గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో పిడుగు పడటంతో చెట్లపై ఉన్న పక్షులు, కోతులు ఒక్క సారిగా పరుగులు పెట్టగా ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. పొలం వద్ద నిర్జీవంగా పడి ఉన్న ఆవును గమనించిన రైతు రాజేంద్ర నాయుడు లబోదిబోమన్నాడు. గ్రామస్తులు ఆవును పరిశీలించగా, అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఆవు విలువ రూ.75 వేలు ఉంటుందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని పాడి రైతు రాజేంద్ర నాయుడు కోరారు.

ప్రైవేటు ఫైనాన్స్ సిబ్బందిపై దాడి

పుంగనూరు రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్న వ్యక్తిపై ఓ యువకుడు దాడి చేసి గాయపరిచిన సంఘటన గురువారం సాయంత్రం పుంగనూరు సమీపంలోని నక్కబండలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు వివరాలు... పట్టణంలోని కొత్తయిండ్లకు చెందిన వెంకటరమణ కుమారుడు భానుప్రకాష్(24) ఒక ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫైనాన్స్ వసూళ్ల కోసం పట్టణ సమీపంలోని నక్కబండకు వెళ్లి తిరిగి వస్తుండగా స్థానిక ఎన్ఎస్‌పేటకు చెందిన మల్లికార్జున కుమారుడు సూర్యహర్ష, అతడి స్నేహితుడు ద్విచక్ర వాహనంలో వచ్చి అడ్డగించి దాడి చేసి గాయపరిచినట్లు భానుప్రకాష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గాయపడిన తనను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

రేషన్ బియ్యం గోల్‌మాల్

● తహసీల్దారుకు కార్డుదారుల ఫిర్యాదు



నిరసన తెలుపుతున్న రేషన్‌కార్డుదారులు

పెద్దపంజాణి, మే 15 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని సదరు డీలరే గోల్‌మాల్ చేసిన విషయం పెద్దపంజాణి మండలంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దపంజాణి మండలం పెదకాప్పల్లె పంచాయతీ ఎగువబేరుపల్లెలో 40 కుటుంబాలు నివాసముంటున్నాయి. వీరందరికీ రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ గ్రామానికి ప్రతినెలా ఎండీయూ వాహనం ద్వారా బియ్యాన్ని స్థానిక డీలర్ శశిభూషణం సరఫరా చేస్తుంటాడు. అయితే గత ఏప్రిల్ నెలలో డీలర్‌తో పాటు అతడి తండ్రి గంగయ్య కూడా వచ్చి ఈ నెలలో ప్రభుత్వం బియ్యం సరఫరా తక్కువగా చేసిందని, వచ్చే నెలలో రెండు నెలల బియ్యం వేస్తామని, అందరూ వేలి ముద్రలు వేయాలని నమ్మబలికి తమ వద్ద వేలి ముద్రలు వేయించుకున్నారని కార్డుదారులు పేర్కొన్నారు. అయితే ఈ నెలలో ఒక నెల బియ్యం మాత్రం వేశారని, గత నెల బియ్యం గురించి అడిగితే మాకు సంబంధం లేదు.. మీకు దిక్కున్నచోట చెప్పుకోండని బెదిరిస్తున్నట్టు బాధితులు గురువారం తహసీల్దారు అనిల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అంతకు ముందు తహసీల్దారు కార్యాలయం వద్ద వారు నిరసన తెలిపారు. డీలర్‌పై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారు.

పార్టీ అధోగతికి కారణం ఎమ్మెల్సీ భరత్ మాత్రమే!

● వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ విమర్శ

కుప్పం, మే 15 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో వైసీపీ అధోగతిపాలు కావడానికి ఎమ్మెల్సీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఆర్‌జే భరత్ మాత్రమే కారణమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏఎస్ విద్యాసాగర్ విమర్శించారు. ఆయన గురువారం తన పార్టీ పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. కుప్పంలోని స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడుతూ 2017లో తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి తాను 14వ వార్డు కౌన్సిలర్ మునస్వామితోపాటు కొద్దిమంది అనుచరులతో వైసీపీలో చేరిన తర్వాత పార్టీ బలం బాగా పెరిగిందన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కూడా కొనసాగిన ఎమ్మెల్సీ భరత్ ఒంటెత్తు పోకడలు పోయారని విమర్శించారు. పార్టీకోసం కష్టపడిన వారిని పట్టించుకోకుండా ఒక గ్రూప్‌ను దగ్గర పెట్టుకుని ఇష్టారాజ్యంగా నిర్ణయాలు చేసుకుంటూ వెళ్లారన్నారు. రామకుప్పం ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల్లో కానీ, కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో కానీ, పార్టీ ఓటమిపాలు కావడానికి ఒక ప్రణాళిక లేకపోవడం, తనవంటి పార్టీకి కష్టపడిన నాయకులను, కార్యకర్తలను కలుపుకుని పోకపోవడమే కారణమని ఆక్షేపించారు. తనతోపాటు కొనసాగుతున్న కౌన్సిలర్ మునస్వామిని, ఆయన తల్లి అయిన మరో కౌన్సిలర్ తిలగవతిని కనీసమైన వివరణ కోరకుండా పార్టీనుంచి సస్పెండు చేయడం అన్యాయమని ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉంటూ అనేక కేసులు పెట్టించుకుని రౌడీషీట్లు ఓపెన్ చేయించుకుని, కోర్టుల చుట్టూ తిరుగుతున్న కార్యకర్తలని పట్టించుకోవడంలేదన్నారు. పైగా ఇదేమని ప్రశ్నిస్తున్న కార్యకర్తల్ని సస్పెండు చేసుకుంటూ వెళ్తున్నారని ధ్వజమెత్తారు. ఓటమి తర్వాత ఎప్పుడో తప్ప భరత్ కుప్పం వైపు తిరిగి చూడడంలేదని, కార్యకర్తల్ని పట్టించుకోవడంలేదని విమర్శించారు. కష్టపడినవారికి గుర్తింపులేని పార్టీలో కొనసాగలేక రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. గతంలో ఏ పార్టీలోని నాయకులను అయినా, కార్యకర్తల్ని అయినా అనుచిత వ్యాఖ్యలతో ఇబ్బంది పెట్టివుంటే క్షమించాలని విన్నవించారు. పార్టీ సిద్ధాంతాల ప్రకారం మాట్లాడాను తప్ప, ఎవరిపైనా వ్యక్తిగత కక్షలు లేవన్నారు. భవిష్యత్తులో తనకు, తనతో ఉన్నవారికి ఏ పార్టీ గుర్తింపు ఇస్తుందో ఆ పార్టీలో చేరే అవకాశం ఉందని విద్యాసాగర్ స్పష్టం చేశారు.

50గ్రాముల బంగారం చోరీ



దుండగులు వంచిన బీరువా తలుపులు - మంచంపై చిందరవందరగా పడేసిన వస్తువులు, దుస్తులు

రామకుప్పం, మే 15 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలోని ఇందిరా నగర్ కాలనీలో గుర్తుతెలియని దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలు.... రామకుప్పం పట్టణం ఇందిరానగర్‌లో నివాసముంటున్న చాంద్‌బాషా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పాఠశాలకు వేసవి సెలవులు కావడంతో చాంద్‌బాషా ఇంటికి తాళం వేసి భార్య దిల్షాద్, పిల్లలు సాహీద్, సమీరాలతో కలిసి తమిళనాడు రాష్ట్రం హోసూరులోని బంధువుల ఇంటికెళ్లారు. గురువారం వారు హోసూరు నుంచి రామకుప్పానికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి, తలుపులు తీసి ఉండటంతో ఆందోళన చెందారు. ఇంటి లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు పగులకొట్టి, అందులో ఉన్న సుమారు 50 గ్రాముల బంగారం చోరీ చేసినట్లు గుర్తించారు. బీరువాలోని వస్తువులను చిందర వందరగా పడేశారు. లాకర్‌ను తీసి అందులోని 23 గ్రాముల బంగారు నెక్లెస్, 20.5 గ్రాముల రెండు జతల కమ్మలు, 6 గ్రాముల రెండు ఉంగరాలను దొంగలు ఎత్తుకెళ్లారు. దోపిడీ విషయాన్ని బాధితుడు దిల్షాద్ రామకుప్పం పోలీసులకు తెలిపారు. కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్, రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్‌లు దోపిడీ జరిగిన ఇంటిని పరిశీలించారు. దోపిడీ జరిగిన ఇంటిని చిత్తూరు క్లూస్ టీం సభ్యులు సందర్శించి, వస్తువులపై ఉన్న వేలిముద్రలను సేకరించారు. దిల్షాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భారత్‌ది ఘనమైన క్రీడా సాంస్కృతిక వారసత్వం



ప్రసంగిస్తున్న డాక్టర్ కృష్ణారావు తదితరులు

కుప్పం, మే 15 (ఆంధ్రజ్యోతి): క్రీడా సాంస్కృతిక రంగాలలో భారత దేశానికి ఘనమైన వారసత్వ ఉందని కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ఆర్.కృష్ణారావు అన్నారు. కళాశాల క్రీడా మైదానంలో గురువారం సాయంత్రం 'సిందూర్ 25' పేరిట క్రీడా సాంస్కృతి ఉత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఫ్యూజన్ ఆఫ్ ట్రాడిషన్, స్పార్క్ ఆఫ్ సెలబ్రేషన్' అనే థీమ్ ఆధారంగా మే, జూన్ మాసాల్లో వివిధ క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు. విద్యార్థుల ఏకత్వం, నాయకత్వం, సృజనాత్మకత, ప్రతిభను ప్రదర్శించే వేదికగా ఈ ఉత్సవం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ చారాల అధ్యక్షుడిగా విజయభాస్కర్‌రెడ్డి



విజయభాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న రమేష్‌రెడ్డి

చౌడేపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): చారాల పంచాయతీ టీడీపీ అధ్యక్షుడిగా విజయభాస్కర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన చారాల పంచాయతీ టీడీపీ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాబు నాయుడు, అడవి రమణ, చిన్నరెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ నేడు ప్రారంభం



ప్రారంభోత్సవ పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ హనుమంతు

చౌడేపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పాలిటెక్నిక్‌ను శుక్రవారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ హనుమంతు తెలిపారు. గురువారం ఆయన మండలంలోని కాటిపేరి సమీపంలో నూతనంగా నిర్మించిన వ్యవసాయ పాలిటెక్నిక్‌ను సందర్శించి, ప్రారంభోత్సవ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఏడీఆర్ డాక్టర్ సుమతి, జిల్లా వ్యవసాయ అధికారి మురళి, ఏడీఏ శివకుమార్, ఏవోలు బాలాజి నాయక్, జ్యోతిమ్మ, సుధాకర్, రాజేష్, టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, వెంకటరెడ్డి, హరిప్రసాద్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ తరగతులు

పలమనేరు, మే 15 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని శ్రీవాణి బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఈనెల 18వతేది నుంచి డిగ్రీ విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, ఐఆర్ఎస్ అధికారి బి.యాదగిరి తెలిపారు. పినాకప్రజాసాధికార ట్రస్టు ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 21 రోజుల పాటు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీషు, కెరియర్ కౌన్సెలింగ్, జీవన నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు కోర్సు డైరెక్టర్లుగా వై.గజేంద్రగౌడు, డి.జయశ్రీ వ్యవహరిస్తారని, ఆసక్తి కలిగిన వారు ఈ ఉచిత శిక్షణ తరగతుల్లో చేరడానికి 81257 78543, 9908 004426లను సంప్రదించాలని కోరారు.

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ



సదుం, మే 15 (ఆంధ్రజ్యోతి): సదుం మండల తహసీల్దారుగా జయప్రకాశ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కుప్పం ఆర్డీవో కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న అయన బదిలీపై సదుంకు వచ్చారు. గతంలో తహసీల్దారుగా పనిచేసిన ఎస్ఎం హాస్సేన్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడి సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న తహసీల్దారు స్థానంలో జయప్రకాశ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో రెవెన్యూ సిబ్బంది వేగవంతంగా, బాధ్యతగా పనిచేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పెద్దపంజాణి, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో బాలాజి పరిశీలించారు. గురువారం బెరపల్లెలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మితమవుతున్న ఫారంపాండ్ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూలీలకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని క్షేత్ర సహాయకులను ఆదేశించారు. జూనియర్ ఇంజనీర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

భారతసైన్య జాతీయ రక్షణనిధికి బేలుపల్లె యువకుల విరాళం

బైరెడ్డిపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేలుపల్లె పంచాయతీకి చెందిన యువకులు భారత సైన్య జాతీయ రక్షణనిధికి రూ.5,500 విరాళంగా పంపినట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. పట్నపల్లె కల్యాణవెంకన్న బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో బేలుపల్లె పంచాయతీకి చెందిన యువకులు జట్టుగా ఏర్పడి టోర్నమెంటులో పాల్గొన్నారు. రన్నర్స్‌గా గెలుపొందిన వీరికి అందిన నగదు బహుమతి రూ.5,500ని భారత సైన్య జాతీయ రక్షణనిధికి అందజేసి తమ దేశభక్తిని చాటుకున్నారు. వీరిని పలువురు అభినందించారు.

నేడు రాములోరి కల్యాణ వేడుకలు

కల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కమ్మపల్లిలో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణ వేడుకలు వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం గంగపూజతో వేడుకలు ప్రారంభం అవుతాయని, రాత్రి స్వామివారి పుష్ప పల్లకీ సేవతో వేడుకలు ముగియనున్నాయని ఉత్సవ కమిటీ తెలిపింది. ధ్వజారోహణం, హోమం, స్వామివారికి పట్టువస్త్రాల సమర్పణ, ఊంజల్‌సేవ, పుష్పయాగం, కల్యాణోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

హత్యాయత్నానికి పాల్పడింది స్నేహితులే

- ఇద్దరిపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): గంగజాతరలో ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడింది అతడి స్నేహితులేనని పోలీసులు గుర్తించారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మిట్టూరుకు చెందిన రాకేష్, జానకారపల్లెకు చెందిన మహబూబ్‌బాష, గౌస్ స్నేహితులు. వీరంతా బుధవారం రాత్రి గంగమ్మ నిమజ్జనంలో ఏర్పాటు చేసిన అర్కెస్ట్రా చూడటానికి వచ్చారు. మద్యం మత్తులో ఉన్న వీరంతా పాత కక్షల నేపథ్యంలో ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో మహబూబ్‌బాష, గౌస్‌లు కలిసి రాకేష్‌ను కత్తితో పొడిచారు. కడుపులోని పేగులు బయటికి రావడంతో అతడిని వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో నిందితులపై కేసు నమోదు చేశారు.

జగన్ వంటి పాలకులతో అప్రమత్తంగా ఉండాలి: టీడీపీ


సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ రెడ్డి వంటి పాలకులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ సూచించారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఏపీపీఎస్సీలో మాజీ సీఎం జగన్, ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులు భారీ స్కామ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. ఉన్నత పదవుల్లో ఉంటూ ఆంజనేయులు నీచానికి పాల్పడ్డారని ఇది స్కామ్ కూడా కాదని రాజద్రోహమని చెప్పారు. ఆధారాలతో ఆంజనేయులు దొరికాడని, ఆయన వెనుకున్న కింగ్ పిన్ ఎవరనే విషయం ఇప్పుడు తేల్చాల్సి ఉందన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'మంగళ విద్యాలయం' ప్రతిభ


చందన - రితిక

పూతలపట్టు, మే 15 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ ఫలితాల్లో పేటమిట్టలో ఉన్న మంగళ విద్యాలయం విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని నిర్వాహకులు తెలిపారు. ఎంపీసీ గ్రూపులో చందన 500 మార్కులకు 456 మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది. టీసీబీలో ఎల్.సంజన 449 మార్కులు, ఎంఈసీలో పి.సంధ్య 425 మార్కులు, సీఈసీలో హర్షన 419 మార్కులు సాధించారు. పదో తరగతి ఫలితాల్లో రితిక 500 మార్కులకు 484 మార్కులతో మొదటి స్థానం, దేవకినందన్ 479 మార్కులతో ద్వితీయ స్థానం, విద్య, శ్రావ్యలు 478 మార్కులతో తృతీయస్థానంలో నిలిచారు. తెలుగులో 17 మంది విద్యార్థులు, సాంఘిక శాస్త్రంలో ఒకరు వంద శాతం మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను అమరరాజా విద్యాసంస్థల చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు అభినందించారు.

ఘనంగా ఉరుసు ఉత్సవం

చిత్తూరు కల్చరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): తేనెబండ హజరత్ సయ్యద్ మురావత్ అలీషా దర్గాలో ఉరుసు ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయాల్లో నేడు ప్రజాదర్బార్

చిత్తూరు సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కార్యాలయాల్లో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపాయి. ● చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం వరకు తన నియోజకవర్గ పరిధిలోని బాధితుల నుంచి అర్జీలను స్వీకరిస్తారు. ● లక్ష్మీనగర్ కాలనీలోనే ఉన్న ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్ కార్యాలయంలోనూ ఉదయం 11 గంటల నుంచి తన నియోజకవర్గ పరిధిలోని బాధితుల నుంచి అర్జీలను స్వీకరిస్తారు. వినతిపత్రంతోపాటు ఆధార్ కార్డు జెరాక్స్ జత చేయాలి.

అటవీ అధికారులపై మండిపాటు

ఎఫ్ఎస్ఓ మండల మీట్‌కు రాకుంటే ఎలా?: సభ్యులు


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ అమరావతి

బంగారుపాళ్యం, మే 15 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అమరావతి అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగింది. అటవీశాఖకు సంబంధించి జరిగిన సమీక్షలో పలువురు ప్రజాప్రతినిధులు అటవీ అధికారుల తీరుపై మండిపడ్డారు. ఎంపీడీవో శ్రీధర్.. ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ (ఎఫ్ఎస్ఓ)ను వేదికపైకి పిలువగా.. బీట్ అధికారి రావడంతో సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. మీ అధికారి ఇప్పటివరకు ఒక్క సమావేశానికి కూడా హాజరు కాలేదని జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షుడు కోకా ప్రకాష్ నాయుడు ఆగ్రహించారు. శెట్టేరి సర్పంచు అనిల్ కుమార్ మాట్లాడుతూ.. వేటగాళ్లు వన్య ప్రాణులను వేటాడి వాటి మాంసాన్ని గ్రామాల్లో విక్రయిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. వెలుతురుచేను, సీజేఎఫ్ఎస్ కాలనీ, పులిమడుగు, బోడబండ్ల అటవీ ప్రాంతాల్లో నిత్యం ఏనుగుల దాడుల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని సభ్యులు ధ్వజమెత్తారు. గ్రామాల్లో అంగన్వాడీ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని సభ్యులు ప్రస్తావించగా, ఇకపై అలా జరగదని సీడీపీవో వాణిశ్రీదేవి తెలిపారు. ట్రాన్స్‌కో ఏఈ దేవీ ప్రసన్న మాట్లాడుతూ.. రైతులకు 24 గంటలు వ్యవసాయం కోసం విద్యుత్ అందించడానికి పనులు వేగవంతం చేస్తున్నామని చెప్పారు. 104 వైద్య సేవలు మంగళపల్లె కేంద్రంలో ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల గ్రామాలకు సౌకర్యంగా ఉంటుందని సర్పంచు కుప్పాల మురళి చెప్పగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని మండల వైద్యాధికారి అన్నారు. ఆర్అండ్‌బీ, ఆర్టీసీ, ఎక్సైజ్, సెరికల్చర్, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు సభకు హాజరు కాలేదు. ఈ సమావేశానికి జడ్పీటీసీ సోమశేఖర్, మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఆసీఫ్, తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీని విజయవంతం చేద్దాం: థామస్

వెదురుకుప్పం, మే 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు జరగనున్న తిరంగా ర్యాలీలో జీడీనెల్లూరు నియోజకవర్గంలోని తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ పిలుపునిచ్చారు. ● అలాగే అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. ● రాయితీతో పశుదాణాను ప్రభుత్వం ఇస్తోందని ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 50 శాతం రాయితీ ఉంటుందని థామస్ గురువారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

గ్రామ పొలిమేర్లలోని క్వారీని ఆపించండి

● గుండ్రాజుకుప్పం దళితుల నిరసన


ఆందోళనకారులతో చర్చిస్తున్న సీఐ విక్రమ్

నగరి, మే 15 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామ పొలిమేర్లలోని క్వారీని ఆపించాలని నగరి మండల పరిధిలోని గుండ్రాజు కుప్పం దళితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు క్వారీ సమీపంలోనే గురువారం షామియానా వేసి నిరసనకు దిగారు. సమాచారం అందుకున్న నగరి సీఐ విక్రమ్ సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. రాళ్ల పగలకొట్టడంతో తమకు ఇబ్బందులున్నాయని తెలిపారు. క్వారీకి అనుమతులు ఉన్నాయని, వెంటనే చర్యలు తీసుకోవడం వీలుకాదని.. రెవెన్యూ, మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని సీఐ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ క్యాంపు

చిత్తూరు రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని చెర్లోపల్లెలో ఎస్వీ అగ్రికల్చర్ కాలేజీ బీఎస్సీ విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాంపు కొనసాగుతోంది. గురువారం గోబర్ గ్యాస్, సోలార్ ఫెన్సింగ్, వర్షపునీటి సంరక్షణ, మురుగునీటి శుద్ధి, టెర్రస్ వ్యవసాయం, పుట్టగొడుగుల పెంపకం తదితరాలను విద్యార్థులు ప్రదర్శించారు. వీటిపై రైతులకు ఏవో వేణుగోపాల్ అవగాహన కల్పించారు. ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ హెడ్ శైలజ, పీఆర్ ప్రశాంతి పాల్గొన్నారు.

చెరువుల సర్వేకు 'రెవెన్యూ' కసరత్తు

గుడిపాల, మే 15 (ఆంధ్రజ్యోతి): అడివిచేనులోని రామిరెడ్డి చెరువు, వసంతాపురంలోని బంగారక్క చెరువు, గుడిపాలలోని నారాయణరెడ్డి చెరువులను సర్వే చేయడానికి రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో చెరువుల విస్తీర్ణం, సప్లయ్ చానళ్లను ఎవరైనా ఆక్రమించుకుని ఉంటే నోటీసులిచ్చి, ఆక్రమణలను తొలగించే చర్యలు తీసుకోవడానికి గురువారం తహసీల్దార్ జయంతి పలు రికార్డులను పరిశీలించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి


మహిళలతో మాట్లాడుతున్న శ్రీదేవి

శ్రీరంగరాజపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి సూచించారు. గురువారం ఎస్ఆర్‌పురం వెలుగు కార్యాలయంలో టైలరింగ్ ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఎంపీడీవో మోహన మురళి, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా ధర్మరాజుల రథోత్సవం


పిండివంటలు నైవేద్యంగా సమర్పించిన గ్రామస్తులు

నిండ్ర, మే 15 (ఆంధ్రజ్యోతి): అత్తూరులో జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధర్మరాజుల రథోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. రథంపై స్వామివారు వెళుతుండగా వివిధ రకాల పిండి వంటలను నైవేద్యంగా గ్రామస్తులు సమర్పించారు. మధ్యాహ్నం ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన హరికథ అలరించింది. ఉభయదారులుగా అత్తూరుకు చెందిన కమ్మవారి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అసోసియేషన్ వారు వ్యవహరించారు.

జీడీనెల్లూరు తెలుగు యువత అధ్యక్షుడికి పితృవియోగం


వెంకటస్వామి(ఫైల్‌ఫొటో) - నివాళులర్పిస్తున్న భీమనేని చిట్టిబాబు తదితరులు

వెదురుకుప్పం, మే 15 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం తెట్టుగుంటపల్లెకి చెందిన జీడీనెల్లూరు తెలుగు యువత అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్ తండ్రి గురుసాల వెంకటస్వామి(78) మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ, జనసేన, బీజేపీ, ఇతర పార్టీ నాయకులు గురువారం కిషన్‌చంద్ ఇంటి వద్దకెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు, పలువురు నాయకులున్నారు.

సంక్షిప్తంగా..

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



చిత్తూరు రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ డెంగ్యూ దినం సందర్భంగా తన చాంబర్‌లో డీఎంహెచ్‌వో సుధారాణి గురువారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. శుక్రవారం అన్ని సచివాలయాల్లో డెంగ్యూ వ్యాప్తిపై స్థానికులకు అవగాహన కల్పించాలని చెప్పారు. డీఎంవో వేణుగోపాల్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు ప్రవీణ, అనూష, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయండి

పెనుమూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని పెనుమూరు మండల ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి హనుమంతు కోరారు. గురువారం తిరివిరెడ్డిపల్లె, గుంటిపల్లె పంచాయతీల్లో ఖరీఫ్ వార్షిక ప్రణాళిక కార్యక్రమం, ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. అభ్యుదయ రైతు పసపల హరికృష్ణారెడ్డి, తిరివిరెడ్డిపల్లె సర్పంచ్ కుసుమ, సంఘమిత్ర అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

ఐరాలలో మోస్తరు వర్షం



ఐరాల, మే 15 (ఆంధ్రజ్యోతి): ఐరాలలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి విపరీతమైన ఎండతో ఉక్కిరిబిక్కిరైన జనానికి సాయంత్రం కురిసిన వానతో ఉపశమనం పొందారు. ఈ వానతో చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు.

ఇళ్ల స్థలాల పరిశీలన

గంగాధరనెల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద గ్రామాల్లో ఎంపికైన లబ్ధిదారుల ఇళ్ల స్థలాలను ఆయా వీఆర్వోలు పరిశీలిస్తున్నారు. అలాగే ఇంటి నిర్మాణానికి అర్హత ఉండి.. స్థలం లేనివారి వివరాలను కూడా సేకరిస్తున్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లకు దరఖాస్తు చేసుకోండి

వెదురుకుప్పం, మే 15 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం, వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం మండలాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లకు అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామని కార్వేటినగరం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సతీష్‌కుమార్ గురువారం తెలిపారు. గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేటినుంచి పుష్పపల్లకీ సేవ

చిత్తూరు కల్చరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబ ఆలయంలో శుక్రవారం నుంచి మూడ్రోజులపాటు పుష్పపల్లకీ సేవ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈవో మునిశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

అలంకరించిన బకాసుర వధ



శ్రీరంగరాజపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): మహాభారతం ఉత్సవాల్లో భాగంగా 49.కొత్తపల్లిమిట్టలో బకాసుర వధ ప్రదర్శన గురువారం అలరించింది. ఆలయ ధర్మకర్త నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డీసీసీబీ జీడీనెల్లూరు బీఎంగా గోమతి

గంగాధరనెల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ జీడీనెల్లూరు బీఎంగా వి.గోమతి బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఇంతకు ముందు ప్రధాన బ్యాంకు ఆఫీస్‌లో మేనేజర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికొచ్చారు. ఇక్కడ పనిచేస్తుండిన మహేష్ చిత్తూరు గాంధీరోడ్డులోని బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు.

టీడీపీ గ్రామ కమిటీల నియామకం


కైపాకంలో ఎంపికైన వారికి ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ధనంజయ యాదవ్

నిండ్ర, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరూరు, కైపాకం, నిండ్ర గ్రామ పంచాయితీల్లో గ్రామ కమిటీలను పరిశీలకుడు చుక్కా ధనంజయ యాదవ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు చిట్టిబాబు, ఆనందరాజు, రఘుయాదవ్, రవికుమార్, సర్పంచ్ ప్రభాకర్ నాయుడు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో జార్ఖండ్ యువకుడి మృతి

చిత్తూరు అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన గోపి(35) పనుల కోసం చిత్తూరుకు వచ్చాడు. గురువారం సాంబయ్యకండ్రిగ సచివాలయం వద్ద ఉన్న ముళ్లపొదల్లో శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులొచ్చి గోపి కుటుంబీకులకు సమాచారమిచ్చి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి



చిత్తూరు అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడు మృతి చెందాడు. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుడిపాల మండలం పేయనపల్లెకు చెందిన ఎతిరాజులు నాయుడు(75) తన కుమారుడు నివాసముంటున్న దుర్గానగర్‌కాలనీకి ఈనెల ఏడో తేదీన వచ్చాడు. ఇంట్లో నిద్రిస్తుండగా గ్యాస్ లీకవ్వడంతో పక్కనే పడుకుని ఉండటంతో గాయపడ్డాడు. కుటుంబీకులు తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి కుమార్తె ప్రజావతి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యం


వెన్నెల

పాలసముద్రం, మే 15 (ఆంధ్రజ్యోతి): మణిపురం గ్రామానికి చెందిన లేట్ మునస్వామి భార్య వెన్నెల(30) మూడ్రోజులుగా కనిపించడం లేదని కుటుంబీకులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం ఐదు గంటలకు రాచపాళ్యం బస్టాప్ నుంచి చిత్తూరు బస్సు ఎక్కినట్లు గ్రామస్తులు తెలిపారు. అప్పటి నుంచి వెతికినా ప్రయోజనం లేకపోయింది. ఆచూకీ తెలిస్తే 94409 00687 నెంబరుకు ఫోన్ చేయాలని పాలసముద్రం ఎస్ఐ చిన్నరెడ్డెప్ప కోరారు.

హత్యాయత్నానికి పాల్పడింది స్నేహితులే

● ఇద్దరిపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): గంగజాతరలో ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడింది అతడి స్నేహితులేనని పోలీసులు గుర్తించారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మిట్టూరుకు చెందిన రాకేష్, జానకారపల్లెకు చెందిన మహబూబ్‌బాష, గౌస్ స్నేహితులు. వీరంతా బుధవారం రాత్రి గంగమ్మ నిమజ్జనంలో ఏర్పాటు చేసిన ఆర్కెస్ట్రా చూడటానికి వచ్చారు. మద్యం మత్తులో ఉన్న వీరంతా పాత కక్షల నేపథ్యంలో ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో మహబూబ్‌బాష, గౌస్‌లు కలిసి రాకేష్‌ను కత్తితో పొడిచారు. కడుపులోని పేగులు బయటికి రావడంతో అతడిని వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో నిందితులపై కేసు నమోదు చేశారు.

ఐరాలలో కుక్కల బెడద


పీఎస్ అగ్రహారంలోని ఓ వీధి నుంచి వస్తున్న కుక్కల గుంపు

ఐరాల, మే 15 (ఆంధ్రజ్యోతి): ఐరాలలో రోజురోజుకూ కుక్కల బెడద ఎక్కువవుతోంది. ఏ వీధిలో చూసినా కుక్కల గుంపులు ఎక్కువయ్యాయి. ద్విచక్ర వాహనాలను, కార్లను వెంబడిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఆవులను, దూడలను కరుస్తున్నాయి. ఒంటరిగా వెళుతున్న చిన్నపిల్లలపై దాడులకు ప్రయత్నిస్తున్నాయి. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.